

ఇన్‌చార్జి పీడీజేను కలిసిన న్యాయవాదులు

వేములవాడ టౌన్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): జిల్లా ఇన్‌చార్జి ప్రధాన న్యాయమూర్తి పుష్పలతను బుధవారం సాయంత్రం వేములవాడ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు సమస్యలపై వివరించారు. ప్రధానంగా వేములవాడకు అడిషనల్ కోర్టు, కోర్టుపై అంతస్థులో భవన నిర్మాణానికి నిధుల మంజూరుపై ఆమెకు విన్నవించారు. ఇవేకాకుండా మండల లీగల్ సర్వీసెస్, మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ నియామకం, తదితర అంశాలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు గుడిసె సదానందం, ఉపాధ్యక్షులు కట్కం జనార్థన్, క్రీడల కార్యదర్శి గుజ్జె మనోహర్, గ్రంథాలయ కార్యదర్శి పంపరి శంకరయ్య, బొజ్జ మహేందర్, కనికరపు శ్రీనివాస్ పాల్గొన్నారు.

రూప్లా నాయక్ తండా సర్పంచ్ ఏకగ్రీవం..?

రుద్రంగి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : రుద్రంగి మండలం రూప్లానాయక్ తండా గ్రామ పంచాయతీ సర్పంచ్‌ను గ్రామంలోని సంఘాలు ఏకగ్రీవంగా ఎన్నుకోవాలని తీర్మానం చేసుకున్నట్లు సమాచారం. రూప్లానాయక్ తండాకు ఎస్టీ జనరల్‌కు కేటాయించారు. గ్రామంలోని అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన భూక్య జవహర్‌లాల్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకొని పోటీలో ఎవరూ ఉండవద్దని గ్రామస్థులు నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. ప్రస్తుతం ఎలాంటి నామినేషన్ పక్రియ ప్రారంభం కాకముందే ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

కట్టలింగంపేట గ్రామపంచాయతీ ఏకగ్రీవానికి మంతనాలు?

చందుర్తి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కట్టలింగంపేట గ్రామపంచాయతీ పాలక వర్గాన్ని ఏకగ్రీవం చేసేందుకు మంతనాలు సాగుతున్నాయి. బుధవారం గ్రామపంచాయతీ సమీపంలో కొందరు బేరాసారాలు జరిపినట్లు సమాచారం. ఓ వ్యక్తి రూ.10లక్షల 50 వేలు చెల్లించేందుకు ముందుకు రాగా మరోవ్యక్తి రూ.15లక్షలు చెల్లించేందుకు ముందుకు వచ్చినట్లు చర్చించుకుంటున్నారు.

పల్లెపోరుకు వేళాయె..



- నేటి నుంచి 29వ తేది వరకు నామినేషన్ల స్వీకరణ
- మొదటి విడత 85 సర్పంచ్, 748 వార్డులకు ఎన్నికలు
- 31 కేంద్రాల్లో నామినేషన్ల స్వీకరణకు ఏర్పాట్లు
- 5 మండలాలు, 94934 మంది ఓటర్లు
- డిసెంబరు 11న పోలింగ్..

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

పల్లె పోరుకు తొలి ముహూర్తం గురువారం మొదలు కానుంది. నోటిఫికేషన్ జారీతోనే నామినేషన్లు స్వీకరించడానికి అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈనెల 25న రాష్ట్ర ఎన్నికల సంఘం మూడు విడతల్లో గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు షెడ్యూల్ ప్రకటించింది.

రాజన్న సిరిసిల్ల జిల్లాలో మొదటి విడత ఎన్నికల కోసం 27వ తేది నుంచి 29వ తేది వరకు నామినేషన్లు స్వీకరించనున్నారు. జిల్లాలో 260 గ్రామ సర్పంచ్‌లు, 2268 వార్డులు ఉన్నాయి. మొదటి విడతలో 5 మండలాల్లో 85 సర్పంచ్, 748 వార్డులకు ఎన్నికల్లో పోటీచేసే వారి నుంచి నామినేషన్ల స్వీకరణ కోసం 31 కేంద్రాలను ఏర్పాటు చేశారు. రిజర్వేషన్లు ప్రకటించడంతోనే పల్లె లో రాజకీయ వేడి రాజుకోగా, నోటిఫికేషన్‌ల జారీ మొదలు కావడంతో ఏకగ్రీవాలపై కసరత్తు జోరు చేశారు. ఇప్పటికే గిరిజన రిజర్వ్ తండాల్లో ఒప్పందాలు జరుగుతున్నాయి. తొలి విడత పోరుకు సంబంధించిన ఏర్పాట్లపై ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ సమీక్షించారు.

ఐదు మండలాలు.. 85 గ్రామాలు

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని 12 మండలాలు ఉండగా మూడు విడతలుగా గ్రామపంచాయతీ ఎన్నికల ప్రక్రియ నిర్వహించనున్నారు. ఇందులో మొదటి విడతగా 5 మండలాలకు సంబంధించిన 85 గ్రామ సర్పంచ్‌లు, 748 వార్డులకు ఎన్నికలను డిసెంబరు 11న నిర్వహించనున్నారు. గురువారం మొదలయ్యే మొదటి విడత నామినేషన్ల ప్రక్రియ 29వ తేది వరకు కొనసాగిస్తారు.

నవంబరు 30న పరిశీలన, డిసెంబరు 3న ఉపసంహరణ, డిసెంబరు 11న పోలింగ్ జరపనున్నారు. మొదటి విడతలో రుద్రంగి మండలంలో 10 సర్పంచ్‌లు, 86 వార్డులు, చందుర్తి మండలంలో 19 సర్పంచ్‌లు, 174 వార్డులు, వేములవాడ అర్బన్‌లో 11 సర్పంచ్‌లు, 104 వార్డులు, వేములవాడ రూరల్ మండలంలో 17 సర్పంచ్‌లు, 146 వార్డులు, కోనరావుపేటలో 28 సర్పంచ్‌లు, 238 వార్డులకు సంబంధించిన నామినేషన్ల స్వీకరణకు రుద్రంగి మండలంలో 4 కేంద్రాలు, చందుర్తిలో 8 కేంద్రాలు, వేములవాడలో 5 కేంద్రాలు, వేములవాడ రూరల్‌లో 5 కేంద్రాలు, కోనరావు పేటలో 9 కేంద్రాలు ఏర్పాటు చేశారు.

మండలం	జీపీలు	వార్డులు	పోలింగ్ కేంద్రాలు	పురుషులు	మహిళలు	మొత్తం
రుద్రంగి	10	86	86	6454	7208	13662
వేములవాడ	11	104	104	8953	9523	18476
వేములవాడరూరల్	17	146	146	9020	9805	18825
కోనరావుపేట	28	238	238	17180	18045	35225
చందుర్తి	19	174	174	13445	14649	28094
మొత్తం	85	748	748	55052	59230	114282

తొలి విడతలో రిజర్వేషన్లు ఇవీ..

జిల్లాలో తొలి విడతలో జరిగే ఐదు మండలాల్లో రిజర్వేషన్లు తీరు ఇలా ఉంది. చందుర్తి మం డలంలో 19 సర్పంచ్ స్థానాల్లో 8 మహిళలకు, 11 జనరల్‌కు కేటాయించారు. ఎస్సీలకు 4 స్థానాలు, బీసీలకు 5, జనరల్ 9 స్థానాలు ఉన్నాయి. రుద్రంగి మండలంలో 10 సర్పం చ్ స్థానాల్లో 5 మహిళలు, 5 జనరల్ ఉండగా ఎస్టీలకు 8, బీసీలకు ఒకటి, జనరల్ ఒకటి స్థానం కేటాయించారు. వేములవాడ రూరల్‌లో 17 సర్పంచ్ స్థానాల్లో 8 మహిళలకు, 9 జనరల్ కేటాయించారు. ఎస్సీలు 4, బీసీలు 2, జనరల్ 9 స్థానాలు ఉన్నాయి. వేములవాడ మండలంలో 11 సర్పంచ్ స్థానాల్లో 5 మహిళలు, 6 జనరల్ కాగా ఎస్సీలు 3, బీసీలు 2, జనరల్ 6 స్థానాలు కేటాయించారు. కోనరావుపేట మండలంలో 28 సర్పంచ్ స్థానాల్లో 13 మహిళలు, 15 జనరల్ కాగా ఎస్టీలు 5, ఎస్సీలు 5, బీసీలు 6, జనరల్ 12 స్థానాలు కేటాయించారు. వార్డు స్థానాల్లో చందుర్తి మండలంలో 174వార్డు స్థానాల్లో 77 మహిళలకు, 97 జనరల్‌కు కేటాయించారు. ఎస్టీలు 8,ఎస్సీలకు 32 స్థానాలు, బీసీలకు 51,జనరల్ 83స్థానాలు ఉన్నాయి. రుద్రంగి మండలంలో 86 వార్డు స్థానాల్లో 45 మహిళలు, 45 జనరల్ ఉండగా ఎస్టీలకు 59, ఎస్సీలకు 3,బీసీలకు 9, జనరల్ 15 కేటాయించారు. వేములవాడ రూరల్‌లో 146 వార్డుస్థానాల్లో 59 మహిళలకు, 87 జనరల్, కేటాయించారు. ఎస్టీలు ఒకటి, ఎస్సీలు 33, బీసీలు 39,జనరల్ 73 స్థానాలు ఉన్నాయి. వేములవాడ మండలంలో 104 వార్డు స్థానాల్లో 45 మహిళలు, 59జనరల్ కాగా ఎస్టీలు 1, ఎస్సీలు 25, బీసీలు 26, జనరల్ 52కేటాయించారు. కోనరావుపేట మండలంలో 238 వార్డు స్థానాల్లో 102మహిళలు మిగతా 8లో

మార్గదర్శకాలకు అనుగుణంగా విధులు..

- ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్

సిరిసిల్ల కలెక్టరేట్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల నోడల్ అధికారులు తమ విధులపై పూర్తి అవగాహన కలిగి, ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా విధులు నిర్వర్తించాలని ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. నోడల్ అధికారులతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో బుధవారం ఎస్పీ మహేష్ బి గీతే, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్‌తో కలిసి సమావేశమై, వారి విధుల సన్నద్ధతపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ నోడల్ అధికారుల విధులు, బాధ్యతలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. రాబోయే ఎన్నికలకు నోడల్ అధికారుల నియామకం చేపట్టినట్లు తెలిపారు. మానవ వనరుల నిర్వహణ, శిక్షణ, రవాణా, మోడల్ కోడ్ కండక్ట్, ఖర్చు పర్యవేక్షణ, పోస్టల్ బ్యాలెట్, ఎలక్టోరల్ రోల్స్, ఎన్నికల పరిశీలకులు విషయమై నోడల్ అధికారుల నియామకం చేసినట్లు తెలిపారు. వివిధ అంశాలకు సంబంధించి నియామకం చేసిన నోడల్ అధికారులు తమకు అప్పగించిన బాధ్యతలకు సంబంధించి అన్ని విధాలుగా సర్వ సన్నద్ధం కావాలన్నారు. ఎన్నికల నిబంధనలు సమగ్రంగా చదివి అర్థం చేసుకోవాలని సూచించారు. ఎన్నికల నిర్వహణకు సరిపోను సిబ్బందిని సమకూర్చుకోవాలన్నారు. పర్యవేక్షణ బృందాల రవాణాకు కావాల్సిన వాహనాలు సిద్ధపర్చుకోవాలన్నారు. వివిధ రకాలుగా జిల్లా యంత్రాంగానికి వచ్చే ఎన్నికల ఫిర్యాదులను వేగంగా, క్వాలిటీ పరిష్కారం చూపేలా సన్నద్ధం కావాలన్నారు.ఎన్నికల ప్రవర్తన నియమావళిని కచ్చితంగా అమలయ్యేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో సిరిసిల్ల ఆర్డీవో వెంకటేశ్వర్లు, డీఆర్డీవో శేషాద్రి, జడ్పీ సీఈవో వినోద్ కుమార్, డీపీవో షరీఫొద్దిన్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో గాలిపల్లి జట్టు ప్రతిభ



విజేతలుగా నిలిచిన గాలిపల్లి బాలికల జట్టు

ఇల్లంతకుంట, నవంబరు 26(ఆంధ్రజ్యోతి) : జిల్లాస్థాయి కబడ్డీ పోటీల్లో గాలిపల్లి జిల్లాపరిషత్ పాఠశాల విద్యార్థినులు ప్రతిభ కనబర్చి ప్రథమస్థానంలో నిలిచారు. జిల్లాలోని చెక్కపెల్లిలో కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి పోటీలు జరిగాయి. ప్రథమస్థానంలో నిలిచిన బాలి కల జట్టును ప్రధానోపాధ్యాయురాలు మేకల పావణి, వ్యాయామ ఉపాధ్యాయుడు సాన బాబు, పాఠశాల కమిటీ చైర్మన్ బట్టు పద్మశ్రీనివాస్, ఈతరం యువజన సంఘ అధ్యక్షుడు గోవికారి నరేష్, ప్రధాన కార్యదర్శి ఎంద్ర సాయిగణేష్, సీనియర్ క్రీడాకారుడు కెశవేని శ్రీనివాస్ ఉన్నారు.

మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికుల ధర్నా



మున్సిపాలిటీ ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు, నాయకులు

సిరిసిల్ల టౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : అపరిష్కృతంగా ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికులు ధర్నా చేపట్టారు. అనంతరం మున్సిపల్ కమీషనర్ ఖాదీర్‌పాషాకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మూషం రమేష్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఆసారపు శంకర్, సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు ఏర్పుల బాలయ్య, జిల్లా నాయకులు ఎలిగేటి రాజశేఖర్, నక్క దేవదాస్, సందుపట్ల పోచమల్లు, నాయకులు బాబా, కిషన్, మమత, మల్లేశం, నరేష్, కార్మికులు పాల్గొన్నారు.

పంచాయతీ ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

- వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణికుముదిని - పాల్గొన్న ఇన్‌చార్జి కలెక్టర్ గరీమ అగ్రవాల్, అధికారులు

సిరిసిల్ల, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ ఐ రాణికుముదిని ఆదేశించారు. బుధవారం పంచాయతీ ఎన్నికల నిర్వహణపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్ నుంచి ఇన్‌చార్జి కలెక్టర్ గరీమ అగ్రవాల్ హాజరయ్యారు. సందర్భంగా రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న గ్రామ పంచాయతీల ఎన్నికలను మూడు విడతల్లో నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్ షెడ్యూల్ విడుదల చేసిందని, డిసెంబరు 11న మొదటి విడత, 14న రెండో విడత, 17న మూడో విడత పంచాయతీ ఎన్నికల పోలింగ్ జరగనున్నట్లు తెలిపారు. పంచాయతీ ఎన్నికల సంబంధించి గ్రామానికి అప్‌డేట్ చేసిన రిజర్వేషన్లు, ఏ విడత పోలింగ్ ఉంటుంది, పోలింగ్ కేంద్రాల జియోలోకేషన్ వివరాలు వెంటనే టీ-పోల్ వెబ్‌సైట్, యాప్‌లో నమోదు చేయాలన్నారు. టీ-పోల్ వెబ్‌సైట్, యాప్‌లో వచ్చే ఫిర్యాదుల పరిష్కారం కోసం జిల్లాలో నోడల్ అధికారిని నియమించాలని, ఎన్నికల కమిషన్ నుంచి వచ్చే ఫిర్యాదులను మూడు రోజుల్లో పరిష్కరించాలని సూచించారు. ఫైనల్‌చేసిన ఓటర్ జాబితా, పోలింగ్ కేంద్రాల ప్రకారం పంచాయతీ ఎన్నికల నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. రెండుకంటే ఎక్కువ పోలింగ్ కేంద్రాల్లో ఉన్న భవనం దగ్గర హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలని, వెబ్‌క్యాస్టింగ్ జరిగే పోలింగ్ కేంద్రాల వివరాలు పంపాలని, పోలింగ్ కేంద్రాలలో మంచి వెలుతురు, ఫర్నిచర్, పవర్ సరఫరా వంటి ఏర్పాట్లు చేయాలని అన్నారు.

నేడు మొదటి విడత నోటిఫికేషన్

గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి మొదటి విడత ఎన్నికల నోటిఫికేషన్ నవంబరు 27న ఉదయం 10.30గంటల వరకు విడుదల చేయాలన్నారు. నోటిఫికేషన్ జారీ చేయడంతో పాటు పంచాయతీ పరిధిలోని ఓటరు జాబితా వివరాలను ప్రచురించాలన్నారు. నవంబరు 27 నుంచి 29వరకు ప్రతిరోజు ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లను స్వీకరించాలని ఆదేశించారు. పంచాయతీ ఎన్నికలకు సంబంధిత రిటర్నింగ్ అధికారులు వద్ద నామినేషన్ దాఖలు చేసేందుకు వీలుగా అవసరమైన ఏర్పాట్లుచేయాలన్నారు. నామినేషన్ల పరిశీలన నవంబరు 30న సాయంత్రం 5గంటల వరకు పూర్తి చేసి చెల్లుబాటైన నామినేటెడ్ అభ్యర్థుల జాబితాను ప్రకటించాలన్నారు. అభ్యర్థుల జాబితాపై అప్పీళ్ల కోసం డిసెంబరు 1, సాయంత్రం 5 గంటల వరకు గడువు ఉంటుందని, డిసెంబర్ 2ను అప్పీళ్లు పరిష్కరించాలని, నామినేషన్ల ఉపసంహరణకు డిసెంబర్ 3 మధ్యాహ్నం 3 గంటల వరకు గడువు ఉంటుందని, అదేరోజు పోటీచేసే అభ్యర్థుల జాబితా ప్రచురణ చేయాలన్నారు. నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, అప్పీళ్ల పరిష్కారం, గుర్తుల కేటాయింపు, పోటీ చేసే అభ్యర్థుల ప్రకటన పకడ్బందీగా జరిగేలా అవసరమైన మార్గదర్శకాల జిల్లా ఎన్నికల అధికారులు జారీచేయాలన్నారు. జిల్లాలో ఉన్న ప్రింటర్లకు అనుమతి లేకుండా ఎన్నికల ప్రచార కరపత్రాల ముద్రణ చేయవద్దని ఆదేశాలు జారీ చేయాలని, ఎన్నికల ప్రచారం సంబంధించి అభ్యర్థుల వ్యయ వివరాలను నమోదు చేసేందుకు ధరలను ఖరారు చేయాలని, ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలుపై స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని కలెక్టర్‌లకు ఎన్నికల కమిషనర్ సూచించారు. ప్రతి జిల్లాలో ఎంసీఎంసీ కమిటీ, జిల్లా మీడియా సెల్ ఏర్పాటు చేయాలన్నారు. ఎన్నికల ప్రచార సమయంలో వినియోగించే ఎలక్ట్రానిక్ వీడియోలకు ముందుగా ఎంసీ. ఎంసీ అనుమతి ఉండాలన్నారు. ఎన్నికల దృష్ట్యా తనిఖీలు నిర్వహించే నేపథ్యంలో రైతులు పంట డబ్బులు తీసుకుని వెళ్లే సమయంలో తప్పనిసరిగా రశీదు పెట్టుకునేలా అవగాహన కల్పించాలన్నారు. ఎంసీఎంసీ అములులో నిర్వహించే తనిఖీలలో నగదు, బంగారం, ఇతర పరికరాలు సీజ్ చేసే సమయంలో తప్పనిసరిగా రశీదు అందించాలని, సీజ్ చేసిన పరికరాలకు సంబంధించిన ఆధారాలు సమర్పించేందుకు ఏ అధికారి ముందు హాజరు కావాలనే వివరాలు ఆ రసీదులో ఉండాలని అన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఇన్‌చార్జి కలెక్టర్ గరీమ అగ్రవాల్

నామిషన్ల స్వీకరణకు ఏర్పాట్లు పూర్తి

- ఇన్‌చార్జి కలెక్టర్ గరీమ అగ్రవాల్

గ్రామ పంచాయతీల రిజర్వేషన్ వివరాలు టీ-పోల్‌లో అప్‌లోడ్ చేశామని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ గరీమ అగ్రవాల్ తెలిపారు. మొదటి విడతగా గ్రామపంచాయతీల్లో ఎన్నికలు నామినేషన్ల స్వీకరణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు చేసేందుకు ఎఫ్‌ఎస్‌టీ, ఎస్‌ఎస్‌టీ బృందాలను ఏర్పాటు చేశామని అన్నారు. ఎంసీఎంసీ, మీడియా సెల్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో సిరిసిల్ల ఆర్డీవో వెంకటేశ్వర్లు, డీఆర్డీవో శేషాద్రి, డీపీవో శర్ఫుద్దిన్ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలి

- ఇన్‌చార్జి కలెక్టర్, ఎన్నికల అధికారి గరీమ అగ్రవాల్



రాజకీయ పార్టీల నాయకులతో మాట్లాడుతున్న ఇన్‌చార్జి కలెక్టర్

సిరిసిల్ల కలెక్టరేట్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో గ్రామపంచాయతీ సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో జిల్లాలో ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని ఇన్‌చార్జి కలెక్టర్, ఎన్నికల అధికారి గరీమ అగ్రవాల్ కోరారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌పై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సిరిసిల్ల సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్‌తో కలిసి ఇన్‌చార్జి కలెక్టర్ గరీమ అగ్రవాల్ బుధవారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు రాజకీయ పార్టీల ప్రతినిధులు లేవనెత్తిన సందేహాలకు అధికారులు సమాధానం ఇచ్చారు. ఇన్‌చార్జి కలెక్టర్, ఎన్నికల అధికారి మాట్లాడారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పకడ్బందీగా అమలు చేయడం జరుగుతుందన్నారు. ఎన్నికలను పూర్తి పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహిస్తామని స్పష్టం చేశారు. కలెక్టరేట్ సముదాయంలో కంట్రోల్ రూమ్, హెల్ప్‌లైన్, ఫిర్యాదుల కేంద్రం ఏర్పాటు చేశామని తెలిపారు. పోటీ చేసే అభ్యర్థులు నూతన బ్యాంక్ ఖాతా ఓపెన్ చేయాలని, నామినేషన్ పత్రాలు పూర్తిగా నింపాలని, తమ పూర్తి సమాచారాన్ని నింపాలని తెలిపారు. ప్రచార వాహనాల అనుమతి తహసీల్దార్, లౌడ్‌స్పీకర్,ర్యాలీలకు పోలీసుల నుంచి అనుమతి తీసుకోవాలని సూచించారు. ప్రతి పోటీ చేసే అభ్యర్థులు ఎన్నికల వ్యయానికి సంబంధించి వివరాలను సంబంధిత అధికారులకు సమర్పించాలని పేర్కొన్నారు. నామినేషన్లు ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు తీసుకుంటారని వెల్లడించారు. ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాలో ప్రచారానికి సంబంధించి జిల్లా పౌర సంబంధాల శాఖ నుంచి అనుమతి తీసుకోవాలని స్పష్టంచేశారు. సిరిసిల్ల ఆర్డీవో వెంకటేశ్వర్లు, డీఆర్డీవో శేషాద్రి, జడ్పీ డిప్యూటీ సీఈవోఎ గీత, డీపీవో షర్ఫుద్దీన్, ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధులు బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి, కుంబాల మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.క

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ ప్రజా వేదిక

ఎలారెడ్డిపేట, నవంబరు26(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండల పరిషత్తు కార్యాలయంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో చేపట్టిన పనులపై అధికారులు 16వ విడత సామాజిక తనిఖీ ప్రజా వేదికను బుధవారం నిర్వహించారు. జడ్పీ సీఈవో వినోద్ హాజరై నివేదికలను పరిశీలించారు. 2024 ఏప్రిల్ 1 నుంచి 2025 మార్చి 31వరకు మండలంలోని 24 గ్రామాల్లో చేపట్టిన వివిధ పనుల నివేదికలను వివరించారు. మొత్తం 477 పనులకు రూ.11,38,97,673 కోట్లు ఖర్చు చేయగా కూలీలకు వేతనాలుగా రూ. 6,68,81,702 కోట్లు, సామాగ్రికి రూ.4,70,15,971 కోట్ల చెల్లింపులు జరిపినట్లు అధికారులు పేర్కొన్నారు. పలుగ్రామాల్లో ఉపాధి సిబ్బంది పనుల ప్రదేశాల వద్ద కొలతల్లో తేడాలు, కూలీల హాజరు, వేతనాల్లో తప్పిదాలు చేశారని తనిఖీ బృందం గుర్తించింది. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సత్తయ్య, జిల్లా విజిలెన్స్ అధికారి రామారావు, పీఆర్ ఏఈ శ్రీనివాస్, ఈజీఎస్ ఏపీవో కొమురయ్య, పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

విదేశీ ఉద్యోగం పేరుతో మోసం

● నిందితుడికి మూడు సంవత్సరాల జైలు శిక్ష

ఇల్లంతకుంట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): విదేశీ ఉద్యోగం పేరుతో మోసం చేసిన ఎర్రవెల్లి భూమయ్యకు న్యాయస్థానం మూడు సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ. 1500 జరిమానా విధించినట్లు ఎస్పై సిరిసిల్ల అశోక్ తెలిపారు. ఎస్పై వివరాల ప్రకారం.. గాలిపెల్లి గ్రామానికి చెందిన బట్టు ఎల్లయ్య ఉపాధికోసం విదేశాలకు వెళ్లాలని భావించాడు. వల్లంపట్ల గ్రామానికి చెందిన భూమయ్య ఉపాధికోసం ఇరాక్ పంపిస్తానని రూ. 71వేలు తీసుకొని దుబాయ్‌కి టూరిస్టు వీసాపై పంపాడు. అక్కడికి వెళ్లిన తర్వాత రెండునెలలకే ఎల్లయ్యను అక్కడి ప్రభుత్వం భారతదేశానికి తిరిగి పంపించింది. మోసపోయానని గ్రహించిన బాధితుడు తన డబ్బులు తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేశాడు. దీనితో భూమయ్య ప్రామిసరి నోట్ రాసి ఇచ్చాడు. ఎన్నిసార్లు అడిగినా డబ్బులు ఇవ్వకపోవడంతో ఎల్లయ్య అతని భార్య లక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. న్యాయస్థానంలో కోర్టు కానిస్టేబుల్ తిరుపతి సాక్ష్యం ప్రవేశపెట్టగా పీపీ విక్రాంత్ కేసు వాదించారు. నేరం రుజువు కావడంతో సిరిసిల్ల రెండవ అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు నిందితుడికి మూడు సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు జరిమానా విధించినట్లు ఎస్పై తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒకరి మృతి

సిరిసిల్ల రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల అర్బన్ పరిధిలోని పెద్దబోనాల శివారులోని రెండో బైపాస్ రోడ్డులో మంగళవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒక వ్యక్తి మృతిచెందాడు. పెద్దూర్ శివారులోని డబుల్ బెడ్‌రూం సముదాయంలో నివాసం ఉంటున్న ఆలెటి మహేష్(40) వేములవాడ పట్టణంలోని టింబర్‌డిపోలో పనిచేస్తూ ప్రతి రోజు ఇంటికి వచ్చిపోతుండేవాడు. మంగళవారం ఉదయం పనికి వెళ్లిన మహేష్ రాత్రి 11 గంటలైనా ఇంటికి రాకపోవడంతో ఫోన్ చేయగా వస్తున్నానని చెప్పాడని భార్య భవ్యశ్రీ తెలిపింది. అర్ధరాత్రి సమయంలో వేములవాడ నుంచి సిరిసిల్లకు వచ్చిన మహేష్ బైపాస్ రోడ్డులో నడుచుకుంటూ పోతుండగా వెనుకనుంచి గుర్తుతెలియని వాహనం మహేష్ పైనుంచి పోవడంతో అక్కడికక్కడే చనిపోయాడు. బుధవారం తెల్లవారుజామున వాహనదారులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్ఐ సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం జిల్లా ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్య భవ్యశ్రీ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



ఆలెటి మహేష్(ఫైల్)

■ డివిజన్ స్థాయి ఆఫీసులు దొరకక ఇబ్బందులు

■ చాలా వరకు అద్దె భవనాల్లో కొనసాగుతున్న వైనం

■ ఏటా లక్షల్లో అద్దె చెల్లింపు.. అయినా వసతుల కొరత



శిథిలావస్థలో కొనసాగుతున్న వేములవాడ పశువైద్యశాల

శిథిలావస్థకు చేరడంతో వేరే చోటుకు మార్చిన ఇరిగేషన్ కార్యాలయం

వేములవాడ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): వేములవాడ మండలం డివిజన్‌గా రూపాంతరం చెంది ఏళ్ల గడుస్తున్నా ప్రభుత్వ కార్యాలయాలు ఎక్కడ ఉన్నాయి..? సంబంధిత డివిజనల్ స్థాయి ప్రభుత్వ అధికారులు ఎవరు అనేది పూర్తిగా ప్రజలకు తెలియకుండా పోయింది. వేములవాడ పట్టణంతో పాటుగా ఆయా పనుల నిమిత్తం డివిజన్ కేంద్రానికి వచ్చే ప్రజలు కార్యాలయాలు ఎక్కడున్నాయో తెలియక ఇబ్బందులు పడుతున్నారు.

● శిథిలావస్థలో కొన్ని కార్యాలయాలు..

వేములవాడ మండల పరిషత్ ఆవరణలో మండల స్థాయి ప్రభుత్వ కార్యాలయాలు నిర్మించి సుమారుగా 40 ఏళ్ల కావస్తోంది. దీంతో ఆయా కార్యాలయాలు శిథిలావస్థలో దర్శనమిస్తున్నాయి. ఇరిగేషన్ కార్యాలయం పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో కార్యాలయం ఎక్కడ ఏర్పాటు చేశారనే సమాచారం ప్రజలకు అందడం లేదు. ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం, వేములవాడ రూరల్ తహసీల్దార్, పశువైద్యశాల కార్యాలయాల వర్షకాలం ఉరుస్తుండడంతో ఫైల్స్, కంప్యూటర్లు తడుస్తున్నాయని, రూరల్ మండలం పరిషత్ కార్యాలయం జడ్పీ భవన్‌లో, ఆర్‌వో కార్యాలయం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో, ఏడీఏ కార్యాలయం వ్యవసాయ మార్కెట్‌లో, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు అరకొర వసతుల మధ్య కొనసాగుతున్నాయి.

● అద్దె భవనాల్లోనే కొనసాగింపు..

వేములవాడ పట్టణంలోని కొన్ని ప్రభుత్వ కార్యాలయాలు ఇప్పటికీ అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. మండల పరిషత్ ఆవరణలోని గతంలో నిర్మించిన ప్రభుత్వ కార్యాలయాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో మరికొన్ని ఇరుకు సందుల్లో, సరైన చిరునామా లేకపోవడంతో నియోజకవర్గ ప్రజలు తీవ్ర అసహనానికి గురవుతున్నట్లు తెలుస్తోంది.సరైన వసతులు లేక ప్రజలు సతమతమవుతున్నారు. ప్రభుత్వం ఏటా లక్షల్లో ప్రజాధనాన్ని అద్దెల రూపంలో చెల్లిస్తున్న ఎలాంటి ప్రజలకు మాత్రం ఇబ్బందులు తప్పడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఆర్‌వో కార్యాలయం, ఎక్సైజ్ శాఖ, ఐసీడీఎస్, తపాలా, సబ్ రిజిస్ట్రార్, నీటి పారుదల శాఖతో పాటు పలు ముఖ్యమైన కార్యాలయాలు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఇరుకు సందులో ఉండటంతో కార్యాలయానికి నిత్యం వందల సంఖ్యలో వచ్చే ప్రజలు వాహనాలు పార్కింగ్ లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

డీఈలను కలవాలంటే సిరిసిల్లకు వెళ్లాలి..

- కోల కృష్ణస్వామి, వేములవాడ పట్టణం



వేములవాడ డివిజన్‌గా ఏర్పడి సంవత్సరాలు గడుస్తుంది. ఇప్పటి వరకు ఏ కార్యాలయాలు ఎక్కడ ఉన్నాయో ప్రజలకు స్పష్టంగా తెలియదు. డీఈల కోసం కార్యాలయాల చుట్టు తిరగాల్సి వస్తోంది. వేములవాడలోని కార్యాలయాలకు వెళితే సిరిసిల్లకు వెళ్లి కలవమంటున్నారు.

సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి..

- చిలుక అంజిబాబు, చందుర్తి



వేములవాడ డివిజనల్ ప్రభుత్వ కార్యాలయాలు ఎక్కడ ఉన్నాయో తెలువడం లేదు. చందుర్తి మండలం నుంచి ఆయా పనుల కోసం వేములవాడ మండల పరిషత్ ఆవరణకు వస్తారు. కొన్ని కార్యాలయాలు శిథిలావస్థకు చేరడంతో అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. వాటి వివరాలతో ఎక్కడ, ఏ కాలనీలో ఉన్నాయో ప్రజలకు తెలిసేలా సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి. ప్రభుత్వం దృష్టి సారించి పక్కా భవనాలు నిర్మించాలి.

ఒకరి ఆత్మహత్య

వీర్నపల్లి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి):మానసిక వ్యాధితో బాధపడుతూ జీవితంపై విరక్తి చెంది రంగంపేట గ్రామానికి చెందిన వెయ్యినూరి చంద్రయ్య(37)అనే వ్యక్తి ఫ్యాన్‌కు ఉరి వేసుకుని మృతి చెందినట్లు ఎస్సై రాజు తెలిపారు. చంద్రయ్య ఆరు సంవత్సరాల నుండి మానసిక వ్యాధితో బాధపడుతున్నాడు. జీవితంపై విరక్తి కలిగి ఇంటిలో ఎవరు లేని సమయంలో బుధవారం ఫ్యాన్‌కు ఉరి వేసుకుని మృతి చెందాడని మృతుడి భార్య వెయ్యినూరి నర్సవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గుర్తు తెలియని మహిళ మృతి



మహిళ మృతదేహం

కోరుట్ల, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల పట్టణంలోని కల్లూర్ రోడ్డులో బుధవారం ఉదయం ఓ నిర్మాణంలో ఉన్న ఇంటి ఎదుట గుర్తు తెలియని మహిళ అపస్మారక స్థితిలో పడిపోయి ఉన్నట్లు స్థానికులు గుర్తించారు. ఆ మహిళను ప్రత్యేక వాహనం ద్వారా పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించే ప్రయత్నం చేసి పోలీసులకు సమాచారం అందించారు. మార్గమధ్యలో మహిళ మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. మహిళ మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి మార్చురీలో భద్రపరిచినట్లు ఎస్ఐ చిరంజీవి తెలిపారు. మహిళ సుమారు 55 నుంచి 60 సంవత్సరాల వయస్సు ఉంటుందని తెలిపారు. మహిళ బ్లూ కలర్ చీర జాకెట్ ధరించి ఉన్నట్లు ఎస్సై తెలిపారు. సమాచారం తెలిసిన వారు కోరుట్ల ఎస్ఐ 87126 56790, సీఐ 8712656820, ట్రూకోర్లు పోలీస్ ఫోన్. 9502318200 నంబర్లో సంప్రదించాలని ఎస్ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో బాలిక మృతి.. బంధువుల ఆందోళన

కొడిమ్యాల, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కొడిమ్యాల మండల కేంద్రానికి చెందిన తిప్పరవేని మధుశ్రీ(11) అనే బాలిక విద్యుదాఘాతంతో మంగళవారం రాత్రి మృతి చెందింది. మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి గుట్టపైకి మెట్ల మార్గానికి ఆలయ కమిటీ వారు విద్యుత్ లైట్లను ఏర్పాటు చేశారు. కింది మెట్ల వద్ద స్నేహితులతో ఆడుతున్న మధుశ్రీకి ప్రమాదవశాత్తు విద్యుత్ వైర్లు తగిలి కింద పడి అపస్మారక స్థితిలో వెళ్లింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించేలోపు బాలిక మృతి చెందింది. తమకు న్యాయం చేయాలని బాలిక బంధువులు బుధవారం ఆలయం ఎదుట రోడ్డుపై బైఠాయించి ఆందోళనకు దిగారు. మల్యాల సీఐ నీలం రవి, కొడిమ్యాల ఎస్సై ఎస్. సందీప్ ఆలయం ఎదుట బైఠాయించిన వారిని సముదాయించారు. ఆలయ కమిటీ నిర్లక్ష్యం కారణంగానే విద్యుత్ ప్రమాదం జరిగిందని ఆందోళనకారులు ఆరోపించారు. ప్రభుత్వపరంగా మృతురాలి కుటుంబానికి సహాయం అందేవిధంగా సహకరిస్తానని సీఐ, ఎస్సై హామీ ఇచ్చారు. విద్యుత్ ప్రమాదంలో మృతికి కారణమైన వారిపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వటంతో కుటుంబ సభ్యులు, బంధువులు ఆందోళన విరమించారు. మృతురాలి తండ్రి తిప్పరవేని నాగరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు. మధుశ్రీ ఒక ప్రైవేటు పాఠశాలలో ఐదో తరగతి చదువుతోంది.



ఆందోళన చేస్తున్న బంధువులు



మధుశ్రీ(ఫైల్)

వేర్వేరు కారణాలతో ఇద్దరి ఆత్మహత్య

బోయినపల్లి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : వివిధ కారణాలతో ఓ వృద్ధురాలు, మరోవ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు బోయినపల్లి ఎస్సై రమాకాంత్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కొదురుపాక గ్రామానికి చెందిన అంజయ్య(58) అనే వ్యక్తి ఇంట్లో ఎవరులేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకోగా, వెంకట్రావుపల్లి గ్రామంలో నల్లాల లక్ష్మి నర్సవ్వ(74) వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. ఆత్మహత్యలకు గల కారణాలు తెలియరాలేదు.

ప్రమాదానికి కారణమైన నిందితుడికి జైలు శిక్ష

జగిత్యాల టౌన్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణంలో జరిగిన రోడ్డు ప్రమాదం కేసులో అజాగ్రత్తగా వాహనం నడిపి ప్రమాదానికి కారణమైన నిందితుడు ఆదువాల నరేష్‌కు న్యాయమూర్తి శ్రీనిజ కోహ్లూర్ నాలుగు నెలల జైలు శిక్షతో పాటు రూ. 200 జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. జగిత్యాల పట్టణానికి చెందిన షేక్ వజిల్ రహమాన్ జులై30, 2020న రాత్రి ద్విచక్ర వాహనంపై ఇస్రాజీపేట నుంచి జగిత్యాలకు వస్తుండగా స్వప్న దాబాసమీపంలో జగిత్యాల నుంచి చల్గల్ వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఆదువాల నరేష్ అతివేగంగా వచ్చి వజిల్ రహమాన్‌ను ఢీకొట్టాడు. ఈ ఘటనలో బాధితుడికి తీవ్ర గాయాలు కావడంతో మొదట జగిత్యాల ప్రభుత్వాసుపత్రికి, అనంతరం మెరుగైన చికిత్స కోసం కరీంనగర్‌కు తరలించారు. బాధితుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి ట్రాఫిక్ ఎస్ఐ అలీ కేసు నమోదు చేసి, విచారణ జరిపి ఛార్జిషీట్ దాఖలు చేశారు. విచారణలో సాక్ష్యాధారాలు పరిశీలించిన న్యాయమూర్తి నిందితుడికి 4 నెలల జైలు శిక్ష, రూ.200 జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో దంపతుల మృతి

● కూతురుకు తీవ్రగాయాలు

వేములవాడ టౌన్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ అర్బన్ మండలం అరెపల్లి గ్రామం వద్ద ద్విచక్రవాహనాన్ని లారీ బుధవారం సాయంత్రం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనంపై వెళుతున్న దంపతులు అబ్దుల్ వసీం(27), ఐఫా (22) అక్కడికక్కడే మృతిచెందగా, వారి రెండేళ్ల కూతురు కాలు విరిగి తీవ్రగాయాలయ్యాయి. వేములవాడ పట్టణ సీఐ వీరప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దపల్లి జిల్లా రామగుండంకు చెందిన వసీం జీవనోపాధి కోసం కుటుంబ సభ్యులతో కరీంనగర్‌లో నివాసం ఉంటున్నాడు. సిరిసిల్లలో ఆదివారం జరిగే ఐఫా సోదరి పెళ్లికి హాజరయ్యేందుకు ద్విచక్ర వాహనంపై కరీంనగర్ నుంచి వెళుతుండగా, సిరిసిల్ల నుంచి కరీంనగర్ వైపు వెళుతున్న లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో ద్విచక్రవాహనంపై ఉన్న భార్యాభర్తలు వసీం, ఐఫా అక్కడికక్కడే మృతిచెందారు. వారి కూతురు కాలు విరిగి తీవ్రగాయాలు కావడంతో చికిత్స కోసం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని, లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు సీఐ తెలిపారు.

కొడుకుపై విచక్షణారహితంగా దాడి

● సోషల్‌మీడియాలో వైరల్

● కేసు నమోదు చేసిన పోలీసులు

మల్యాల, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): తల్లిని తరచూ ఎందుకు తిడుతున్నావని అడిగిన కొడుకుపై తండ్రి కర్రతో విచక్షణారహితంగా దాడి చేశాడు. ఈ ఘటన మల్యాల మండలం బల్వంతాపూర్, సర్వాపూర్ గ్రామాల మధ్య గల కొండపోచమ్మ ఆలయం వద్ద జరిగింది. తండ్రి రాజయ్య దాడి చేసిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. మల్యాలకు చెందిన ఆరుగొండ రాజయ్య, భార్య మల్లవ్వ మధ్య మనస్పర్థలు రాగా కొన్నేళ్లుగా విడివిడిగా ఉంటున్నారు. మల్లవ్వ తన తల్లిగారిల్లు బల్వంతాపూర్‌లో కొడుకు గణేశ్‌తో ఉంటున్నది. సోమవారం బల్వంతాపూర్ శివారులోని పోచమ్మ ఆలయం వద్ద రాజయ్యను తన తల్లిని ఎందుకు తిడుతున్నావని కొడుకు అడుగడంతో తండ్రి కర్రతో దాడి చేశాడు. ఆ దృశ్యాలు సోషల్‌మీడియాలో రెండు రోజులుగా చక్కర్లు కొట్టగా గణేశ్ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో రాజయ్యపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపారు.



కొడుకుపై దాడి చేస్తున్న రాజయ్య

ఆర్టీసీ బస్సుపై తెగిపడిన విద్యుత్ వైరు

జగిత్యాల టౌన్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ సర్కిల్ వద్ద ఆర్టీసీ బస్సుపై విద్యుత్ సర్వీస్ వైరు తెగిపడింది. బస్సులో ఉన్న ప్రయాణికులకు పెను ప్రమాదం తప్పింది. నిర్మల్ డిపోకు చెందిన పల్లె వెలుగు ఆర్టీసీ బస్సు బుధవారం ఉదయం నిర్మల్ నుంచి ఖానాపూర్, మల్లాపూర్, రాయికల్ మీదుగా జగిత్యాలకు చేరుకుంది. కొత్త బస్టాండ్ చౌరస్తా సమీపంలో విద్యుత్ సర్వీస్ వైరు తెగి ఆర్టీసీ బస్సుపై పడింది. గమనించిన డ్రైవర్ హుటాహుటిన బస్సును నిలిపివేసి ప్రయాణికులను దింపివేశాడు. అనంతరం విద్యుత్ అధికారులకు సమాచారం అందించగా వారు విద్యుత్ సరఫరా నిలిపివేశారు. తెగిన విద్యుత్ వైరును తొలగించి బస్సును బస్టాండ్‌లోకి తీసుకెళ్లారు.

వావిలాలపల్లిలో ఇంట్లోకి చొరబడిన నక్క

కరీంనగర్ క్రైం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ వావిలాలపల్లిలో మంగళవారం రాత్రి అడవి జంతువు నక్క తప్పిపోయి ఒక ఇంటిలోకి చొరబడింది. అటవీ ప్రాంతం నుంచి ఎలా తప్పిపోయిందో తెలియదు కాని ఆ నక్క నేరుగా వావిలాలపల్లిలోని కుంకం సునీల్‌రావు ఇంటి ఆవరణలోకి ప్రవేశించింది. రాత్రంతా ఆయన ఇంటిలోని ఆవరణ, స్నానాల గదిలోనే ఉంది. బుధవారం ఉదయం నక్కను చూసేందుకు స్థానికులు రాగా వారి అలికిడితో ఇంటిలో నుంచి బయటకు పారిపోయింది. నక్క శాతవాహన విశ్వవిద్యాలయం గుట్ట ప్రాంతం, రేకుర్తి, మల్కాపూర్ గుట్టల ప్రాంతాల నుంచి వచ్చి ఉంటుందని భావిస్తున్నారు. నక్కలు ఎక్కువగా కోళ్లు, పక్షులను ఆహారంగా తీసుకుంటాయి. ఆహారం వెదుకుతూ దారితప్పిపోయి పట్టణంలోకి ప్రవేశించి ఉంటుందని అటవీశాఖ అధికారులు చెబుతున్నారు.



వావిలాలపల్లిలో ఓ ఇంటి వద్ద ఉన్న నక్క

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

కరీంనగర్ క్రైం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలం చెర్లభూత్కూర్ గ్రామంలోని ఒక వ్యవసాయ బావిలో గుర్తుతెలియని వ్యక్తి(40-45) మృతదేహం మంగళవారం లభ్యమైందని కరీంనగర్ రూరల్ సీఐ ఏ నిరంజన్‌రెడ్డి తెలిపారు. మృతుడిని గుర్తించినవారు కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి ఫోన్. 8712670764, ఎస్ఐ టి నరేష్ ఫోన్. 8712574753, ఎస్ఐ లక్ష్మారెడ్డి ఫోన్ 9000884443లో సమాచారం అందించాలని కోరారు. మృతుడు ఫుల్ టీ షర్ట్, బ్లాగ్ ప్యాంట్, బూం బూట్లు ధరించి ఉన్నాడని తెలిపారు.

బెల్ట్‌షాపు నిర్వాహకుల బైండోవర్

కరీంనగర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలంలో బెల్ట్‌షాపుల నిర్వాహకులతో పాటు పాత నేరస్తులను బుధవారం బైండోవర్ చేశామని కరీంనగర్ రూరల్ సీఐ ఏ నిరంజన్‌రెడ్డి తెలిపారు. ముగ్దుంపూర్, దుర్శేడ్, తీగలగుట్టపల్లి, చామనపల్లి గ్రామాలకు చెందిన శివప్రసాద్, రవి, శ్రీనాథ్, వర్ర రాం, భూమయ్య, శ్రీనివాస్‌లను కరీంనగర్ రూరల్ తహసీల్దార్ ఎదుట హాజరుపరచి లక్ష రూపాయల స్వంత పూచీకత్తుపై బైండోవర్ చేసినట్లు సీఐ తెలిపారు. రూరల్ మండలంలో బెల్ట్‌షాపులు నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ నిరంజన్‌రెడ్డి హెచ్చరించారు.

శ్రీరాంసాగర్‌లో నిలకడగా నీరు

జగిత్యాల, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి బుధవారం స్వల్పంగా నీరు వస్తోంది. దీంతో డ్యాంలో నీరు నిలకడగా ఉంది. ఎగువ ప్రాంతం నుంచి ప్రాజెక్టులోకి 1,338 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 80.501 టీఎంసీలు కాగా అంతే స్థాయి నీటి మట్టంతో ప్రాజెక్టు నిండుకుండలా ఉంది. ప్రాజెక్టులోకి ఈ ఏడాది జూన్ 1వ తేదీ నుంచి ఇప్పటి వరకు 948.052 టీఎంసీల నీరు వచ్చి చేరగా, ప్రాజెక్టు నుంచి 880.339 టీఎంసీల నీరు దిగువకు వదిలారు.

ఫుట్‌బాల్ ఆడుతూ గాయపడిన విద్యార్థి

- చికిత్స పొందుతూ మృతి

పెద్దపల్లిటౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని రంగంపల్లికి చెందిన పదవతరగతి విద్యార్థి కనవేన ప్రతీక్(14) మంగళవారం స్కూల్‌లో ఫుట్‌బాల్ ఆడుతూ గాయపడ్డాడు. వెంటనే అతన్ని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. వివరాల్లోకి వెళితే.. పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని పెదపల్లి, చీకురాయి రోడ్డులోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో ప్రతీక్ పదో తరగతి చదువుతున్నాడు. పాఠశాలలో మంగళవారం ఆటల పీరియడ్‌లో ఫుట్‌బాల్ ఆడుతుండగా ప్రమాదవశాత్తు కిందపడి పోయాడు. కొద్దిసేపటికి వాంతులు చేసుకున్నాడు. దీంతో అతన్ని వెంటనే ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడి నుంచి కరీంనగర్‌కు తరలించారు. అక్కడి వైద్యులు ప్రతీక్ బ్రెయిన్‌లో రక్తం గడ్డకట్టిందని తెలిపారు. ఈ క్రమంలో అక్కడే చికిత్సపొందుతూ రాత్రి 11గంటలకు ప్రతీక్ మృతి చెందాడు. ప్రతీక్ తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రతీక్ రెండు కళ్లు దానం

ప్రతీక్ ప్రమాదశాత్తు మరణించగా అతని కళ్లను దానం చేసేందుకు తండ్రి ఒప్పుకున్నారు. ప్రతీక్ తండ్రి కుమారస్వామి అతడి రెండు కళ్లను ఎల్వీ ప్రసాద్ ఆసుపత్రికి దానం చేస్తామని తెలిపారు. లయన్స్ క్లబ్ సంబంధించిన నిపుణులు ప్రతీక్ కళ్లు సేకరించి ఎల్వీప్రసాద్ ఆస్పత్రికి పంపించారు.

గుప్త నిధుల కోసం వేట

● స్వామిజీ వేషంలో ప్రజలను మోసం చేస్తున్న ముగ్గురి అరెస్ట్ ● సీఐ వెంకటేశ్వర్లు

కోనరావుపేట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): గుప్త నిధులు ఉన్నాయని, వాటిని తీసి ఇస్తామని నమ్మించి డబ్బులు కాజేసిన స్వామిజీ వేషంలో మోసం చేస్తున్న ముగ్గురిని బుధవారం అరెస్టు చేసి రిమాండ్ తరలించగా, మరొకరు పరారీలో ఉన్నట్లు చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కోనరావుపేట మండలం నిజామాబాద్ గ్రామానికి చెందిన దుగ్గు వేణు ఇంటికి పెద్దూరు గ్రామానికి చెందిన కేతిరి నరేష్ స్వామిజీ వేషంతో వచ్చి మీకు మంత్రాలు చేశారని, నయం చేస్తానని చెప్పి యంత్రం కట్టి 3 వేల రూపాయలు తీసుకున్నాడు. మళ్లీ స్వామిజీ వేషంలో వచ్చిన నరేష్ పెద్ద మొత్తంలో డబ్బులు తీసుకోవాలని ప్లాన్ ప్రకారం మీ ఇంటిలో గుప్త నిధులు ఉన్నాయని, తనకు తెలిసిన బాబాను పిలిపించి నిధులు తీస్తానని నమ్మబలికాడు. దీంతో వేణు నమ్మి మరో 50 వేల రూపాయలు ఇచ్చాడు. డబ్బులు కాజేసిన నరేష్‌తో పాటు పెద్దూరు గ్రామానికి చెందిన కడవంచ ప్రసాద్, చంద్రంపేటకు చెందిన సదుల దేవేందర్ కలిసి వేణు ఇంటికి వచ్చి రాత్రిపూట పూజలు చేసినట్లు నటించి నిధి కోసం తవ్వినట్లు చేసి అందులో అక్కడ ఒక ఇత్తడి విగ్రహం కనిపించేలా చేసి ఆ విగ్రహాన్ని వెంటనే మూసేశారు. ఇంటిలో నాగబంధం ఉందని, జలానే తవ్వితే ప్రాణం నష్టం కలుగుతుందని నమ్మించారు. ఆ నిధిని తీయడానికి అఘోరాలను పిలిపించాలని మరో మూడు లక్షల 40 వేల రూపాయలు ఖర్చు అవుతాయని, నగలలో ఆపేస్తే ఇబ్బందులు కలుగుతాయని బెదిరించారు. భయపడ్డ వేణు అందుకు ఒప్పుకుని మూడు లక్షల 40 వేల రూపాయలు ఇచ్చాడు. దీంతో ఆ ముగ్గురు కలిసి చంద్రంపేటకు చెందిన సదుల రాజేశం అనే మరొక వ్యక్తిని అఘోరీ వేషం వేయించుకొని రాత్రిపూట ఇంటికి వచ్చి పూజలు నిర్వహించి గుప్త నిధుల కోసం వేట ప్రారంభించినట్లు నటించారు. నిధుల కోసం తవ్వుతుండగా అందులో నుంచి వారి వెంట తెచ్చుకున్న కోరలు తీసిన నాగుపాము వచ్చి కాటేసినట్లుగా చేసి కాటేసిన వ్యక్తి నురగలు తీస్తున్నట్లు నటిస్తూ హాస్పిటల్ తరలించాలని వేణుని బెదిరించారు. మరో 15 వేల రూపాయలు ఇచ్చి ఆసుపత్రికి తరలించినట్లు సీన్ క్రియేట్ చేశారు. అప్పటి నుంచి నరేష్ మరో ముగ్గురు వ్యక్తులు కనిపించక పోవడంతో ఆయాకే తెలుసుకొని పెద్దూర్ గ్రామంలో ఉంటున్న నరేష్‌ను తన డబ్బులు తిరిగి ఇవ్వాలని అడగగా డబ్బులు ఇవ్వనని బెదిరించాడు. దీంతో వేణు కోనరావుపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకొని ఎస్సై ప్రశాంత్‌రెడ్డి దర్యాప్తు ప్రారంభించారు. నిజామాబాద్ శివారులో ముగ్గురిని పట్టుకొని వారి వద్ద నుంచి మూడు లక్షలు స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించగా, రాజేశం పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఎస్సై ప్రశాంత్‌రెడ్డి, పోలీస్ సిబ్బందిని సీఐ వెంకటేశ్వర్లు అభినందించారు.



నిందితుల అరెస్ట్ చూపుతున్న పోలీసులు

కొట్టుకుపోయి.. ప్రమాదకరంగా మారి..



ప్రమాదకరంగా మారిన వాగుపై రహదారి

ఎల్లారెడ్డిపేట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఎల్లారెడ్డిపేట మండలం పదిర గ్రామ శివారులోని మానేరు వాగు ఉధృతికి సీసీ రహదారి కొట్టుకుపోయింది. ఎల్లారెడ్డిపేట, ముస్తాబాద్ మండలాలకు రాకపోకలు సాగించే రోడ్డు ధ్వంసమైంది. వరద ప్రవాహం తగ్గడంతో సీసీ శిథిలాలు వాగులో తేలాయి. రహదారి ప్రమాదకరంగా మారింది. వాహనదారులు అదుపు తప్పి గాయాలకు గురవుతున్నారు. మరమ్మతులు చేయాల్సిన అధికారులు పట్టించుకోకపోవడం వల్ల ఇబ్బందులు పాలవుతున్నామని వాహనదారులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వాగుపై ఉన్న రహదారికి మరమ్మతులు చేసి ప్రమాదాలను అరికట్టాలని కోరుతున్నారు.

భీమన్న సన్నిధిలో భద్రత పటిష్టం

- అదనంగా 12మంది స్పెషల్ పోలీసుల కేటాయింపు
- నోడల్ అధికారిగా స్పెషల్ బ్రాంచి ఎస్ఐకి బాధ్యతలు



హోంగార్డులతో మాట్లాడుతున్న ఈవో రమాదేవి

వేములవాడ టౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థానం విస్తరణ నేపథ్యంలో భీమేశ్వరాలయంలో భక్తుల రద్దీకి అనుగుణంగా భద్రతను పటిష్టం చేశారు. రాబోయే మేడారం సమ్మక్క, సారలక్క జాతర సందర్భంగా వేములవాడకు లక్షలాది భక్తులు వచ్చి స్వామివారికి మొక్కులు చెల్లించడం ఆనవాయితీ అయినందున రద్దీకి అనుగుణంగా భద్రత చర్యలు చేపట్టారు. నోడల్ అధికారిగా స్పెషల్ బ్రాంచి ఎస్ఐ రాజ్‌కుమార్‌కు అదనపు బాధ్యతలు ఇచ్చారు. ఇతను 30మంది పోలీస్ ఫోర్స్‌తో సిద్ధంగా ఉంటారు. వీరేకాకుండా ప్రతి సోమ, శుక్ర, ఆదివారాల్లో వేములవాడ టౌన్ పోలీస్ స్టేషన్ నుంచి సీఐ, ఇద్దరు ఎస్ఐలు నిరంతరం భద్రతా చర్యల్లో భాగస్వాములవుతారు. ఇప్పటికే 10 ప్లస్ 2 స్పెషల్ పోలీస్ ఫోర్స్(ఎస్‌పీఎఫ్) ఆలయ భద్రతలో పాలుపంచుకుంటుంది. ప్రస్తుతం భీమేశ్వరాలయంలో భక్తుల దర్శనాలు కొనసాగడంతో అదనంగా పోలీస్ ఫోర్స్ కావాలని లేఖ రాయడంతో అదనంగా 12మంది స్పెషల్ పోలీస్ ఫోర్స్‌ను కేటాయిస్తూ ఆదేశాలు ఇచ్చారు. వీరంతా షిఫ్ట్‌ల వారీగా ఆలయ భద్రతా విధుల్లో ఉంటారు. వీరే కాకుండా రాజన్న ఆలయానికి 36మంది హోంగార్డులను కేటాయించారు.

హోంగార్డులకు ఈవో సూచనలు

భీమేశ్వరాలయంలో విధులు నిర్వహించే హోంగార్డులకు ఆలయ ఈవో ఎల్. రమాదేవి బుధవారం పలు సూచనలు చేశారు. హోంగార్డులు నిర్వహించే ప్రాంతాల్లో తప్పకుండా కనిపించాలని, భక్తులకు సహాయం మాత్రమే చేయాలని, ఎలాంటి దర్శనాలకు, ప్రలోభాలకు పాల్పడవద్దని హెచ్చరించారు. ఎవరైనా దర్శనాలకు వెళ్లాలనుకుంటే నేరుగా కలిస్తే ఏర్పాట్లు చేస్తామని సూచించారు.

కూరగాయల సాగుకు ప్రోత్సాహం

- రైతులకు రాయితీ ఇస్తున్న రాష్ట్ర ప్రభుత్వం
- సద్వినియోగం చేసుకోవాలంటున్న అధికారులు



హుజూరాబాద్‌రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కూరగాయల సాగు విస్తీర్ణం పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ప్రోత్సాహం అందిస్తోంది. కూరగాయల నారు, శాశ్వత పందిళ్లు, మల్చింగ్, ప్రథమ శ్రేణి ప్రదర్శన క్షేత్రం, ట్రెల్లిసింగ్‌కు(ఊతం)ల కోసం పలు రాయితీలు ఇస్తున్నది. మండలవ్యాప్తంగా 90 ఎకరాల్లో మాత్రమే కూరగాయల పంటలను సాగు చేస్తున్నారు.

● శాశ్వత పందిళ్లు

బీర, కాకర వంటి తీగజాతి కూరగాయల సాగు కోసం శాశ్వత పందిళ్ల నిర్మాణానికి 50 శాతం రాయితీ ఇస్తున్నారు. ఒక యూనిట్‌కు రాయితీ రూ.50 వేలు (విస్తీర్ణం అర ఎకరం) ఐదు యూనిట్ల వరకు రైతుకు అవకాశం ఉంటుంది.



రాంపూర్ గ్రామంలో కూరగాయల పంటను పరిశీలిస్తున్న ఉద్యానవన శాఖాధికారులు

● మల్చింగ్‌తో ఉపయోగాలు

కూరగాయల సాగులో కలుపు సమస్యను అధిగమించడానికి తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి సాధించడానికి మల్చింగ్ ఉపయోగపడుతుంది. ఎకరానికి రూ. 8 వేల వరకు రాయితీ ఉంటుంది. ఒక రైతు 5 ఎకరాల వరకు రాయితీ పొందవచ్చు.

● అంటు మొక్కలకు రాయితీ

భూమి ద్వారా సంక్రమించే వివిధ తెగుళ్లు, చౌడు నేలలకు తట్టుకుని అధిక దిగుబడి ఇచ్చే అంటు మొక్కల(వంగ)కు ప్రభుత్వం ఎకరానికి రూ. 30 వేల వరకు రాయితీ ఇస్తుంది. పరిమితి ఒక ఎకరం.

● ట్రెల్లిసింగ్ (ఊతం)

ట్రెలిస్లింగ్ విధానంలో టమాట ఇతర కూరగాయల పంటలు సాగు చేయడానికి ఎకరానికి రూ. 10 వేల రాయితీ సదుపాయం కల్పించబడింది. రాయితీ ఒక ఎకరానికి మాత్రమే పరిమితం. దీంతో పాటు బిందు సేద్యానికి ఎస్సీ ఎస్టీలకు 90 శాతం, ఇతరులకు 80 శాతం, తుంపర్ల సేద్యానికి 75 శాతం రాయితీ ఉంది. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఉద్యానవన శాఖాధికారులు కోరుతున్నారు.

● కూరగాయలకు రాయితీ

టమాట, వంగ, పచ్చి మిరప, క్యాబేజి, క్యాలీఫ్లవర్ వంటి కూరగాయల నారుపై ప్రభుత్వం రైతులకు వందశాతం రాయితీ ఇస్తుంది. కావాల్సిన నారు కోసం రైతులు సిద్దిపేట జిల్లాలోని ములుగు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో సంప్రదిస్తే ఉచితంగా పెంచి ఇస్తారు. అందుకు రైతులు పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్, బ్యాంక్ అకౌంట్ జిరాక్స్ పత్రాలతో 30 రోజుల ముందు ఉద్యానవన శాఖాధికారిణి కలవాలి.

రాయితీలను సద్వినియోగం చేసుకోవాలి



- మంజువాణి, మండల ఉద్యానవనశాఖాధికారి, హుజూరాబాద్

రైతులు కూరగాయల సాగుపై ఆసక్తి చూపాలి. ఇక్కడి రైతులు ఉద్యానవన పంటలను చాలా తక్కువ విస్తీర్ణంలో సాగు చేస్తున్నారు. కూరగాయల సాగు చేస్తే ఉద్యాన శాఖ నుంచి ఎక్కువ మొత్తంలో రాయితీలు వస్తున్నాయి. రైతులు వాటిని సద్వినియోగం చేసుకుని లాభాలు పొందాలి.

రాజన్న హుండీ ఆదాయం రూ. 94.29లక్షలు

వేములవాడ టౌన్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయ హుండీ ఆదాయం రూ.94.29లక్షలు సమకూరింది. బుధవారం భీమేశ్వరసదన్ పై అంతస్తులో ఆలయ హుండీలను లెక్కించారు. 94.20లక్షల నగదు, 67.500 గ్రాముల బంగారం, 4కిలోల వెండిని భక్తులు కానుకలుగా సమర్పించారని ఆలయ ఈవో ఎల్. రమాదేవి తెలిపారు. ఈ హుండీల లెక్కింపులో కరీంనగర్ సహాయ కమిషనర్ కార్యాలయ పరిశీలకులు రాజమౌళి, ఏఈవోలు, పర్యవేక్షకులు, ఆలయ సిబ్బంది, శివరామకృష్ణ భజనమండలి సేవా సమిత సభ్యులు పాల్గొన్నారు.

కార్మిక చట్టాలన్నీ అమలు చేయాలి

పాలకుర్తి, వంబరు 26 (ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం 21 నవంబరు 2025నుంచి 29కార్మిక చట్టాల స్థానంలో అమలుచేసిన 4లేబర్ కోడ్లను రద్దుచేసి 29చట్టాలను యథావిధంగా అమలులోకి తీసుకురావాలని బుధవారం పౌరహక్కుల సంఘం ఉమ్మడి కరీంనగర్‌జిల్లా కమిటీ ఓ పత్రిక ప్రకటనలో డిమాండ్ చేసింది. పౌరహక్కుల సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా కమిటీ అధ్యక్షుడు బొంకూరి లక్ష్మణ్, పౌరహక్కుల సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా కమిటీ ప్రధానకార్యదర్శి బొడ్డుపల్లి రవి ఆ ప్రకటనలో పలు అంశాలను పేర్కొన్నారు. ప్రభుత్వం కుట్రపూరితంగా చట్టాలను కోడ్లుగా మార్చి కార్మికులకు అందనీయకుండా చేస్తుందని ఆరోపించారు. నాలుగు కోడ్లను నిలువరించి కార్మికచట్టాలను అమలు చేసుకోవాలన్నారు.

రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ బాస్కెట్‌బాల్ పోటీలు ప్రారంభం

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి):జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-17 బాస్కెట్ బాల్ పోటీలను డీఈవో శ్రీరాం మొండయ్య బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పోటీల నిర్వహణ కార్యదర్శి బి.వేణుగోపాల్, రాష్ట్ర ఎస్‌జీఎఫ్ పరిశీలకులు కౌముదిని పాల్గొన్నారు.

మట్టి తరలిస్తున్న వారిపై కేసు

శంకరపట్నం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం మెట్‌పల్లిలో అక్రమంగా మట్టి తరలిస్తున్న వారిపై కేసు నమోదైంది. మెట్‌పల్లికి చెందిన అంతడుపుల మహేందర్, తోట సతీష్ అక్రమంగా జేసీబీ, ట్రాక్టర్ ద్వారా మట్టి రవాణా చేస్తుండగా పట్టుకొని, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శేఖర్‌రెడ్డి తెలిపారు.

నాణ్యతా లోపంతోనే కూలిన చెక్‌డ్యామ్

పెద్దపల్లి ఎమ్మెల్యే సీహెచ్ విజయరమణారావు



మాట్లాడుతున్న పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు

కరీంనగర్ అర్బన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట మండలం గుంపుల-తనుగుల మధ్యన మానేరు వాగులోని చెక్‌డ్యామ్ నాణ్యతా, డిజైన్ లోపంతో కూలిపోయిందని పెద్దపల్లి ఎమ్మెల్యే సీహెచ్ విజయరమణారావు అన్నారు. బుధవారం కరీంనగర్ ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో విలేకరులతో మాట్లాడారు. చెక్‌డ్యాంను పేల్చివేసినట్లు నిరూపిస్తే తాను రాజకీయాల నుంచి తప్పుకుంటానని, కుంగిపోయిందని నిరూపిస్తే మీరు రాజకీయాల నుంచి తప్పుకుంటారా? అని మాజీ మంత్రి హరీష్‌రావుకు సవాల్ విసిరారు. బీఆర్ఎస్ హయాంలో అవినీతితోనే ఆ చెక్ డ్యామ్ కూలిందన్నారు. లోతు నుంచి నిర్మాణం జరపకుండా, ఇసుకపై చెక్‌డ్యాం నిర్మించినందునే కొట్టుకుపోయిందన్నారు. చెక్‌డ్యాంను కూల్చివేశారంటూ మాజీ మంత్రి హరీష్‌రావు దుష్ప్రచారం చేస్తున్నారని, అబద్ధాలను నిజంలా నమ్మించడంలో ఆయన దిట్టని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కరీంనగర్ నుంచి మల్హర్ మండలం వరకు సుమారు రూ.300 కోట్లు వెచ్చించి 23 చెక్ డ్యామ్‌లు నిర్మించారని, వారి ప్రభుత్వంలోనే 8 చెక్ డ్యామ్‌లు కూలిపోయాయని అన్నారు. కేవలం ఇసుక కోసమే చెక్ డ్యామ్‌లు నిర్మించిందని ఆరోపించారు. కేసీఆర్, కేటీఆర్, హరీష్‌రావు కమీషన్‌ల కోసం అవినీతికి పాల్పడ్డారన్నారు. తేదీ ఖరారు చేస్తే... బీఆర్ఎస్ హయాంలో కూలిన చెక్ డ్యామ్‌లు చూపిస్తానన్నారు. ఇసుక మాఫియా కాదు, కేసీఆర్ కుటుంబం ఇసుక దొంగలు అన్నారు. ఇదే ఇసుక దొంగలు రాజన్న సిరిసిల్ల జిల్లా నేరెళ్ల బాధితులపై థర్డ్ డిగ్రీ ప్రయోగించి దళితులను జైలుకు పంపించారన్నారు. దోచుకున్న సొమ్ము కోసమే కేసీఆర్ కుటుంబ సభ్యులు గొడవ పడుతూ రోడ్డున పడుతుతున్నారన్నారు. ప్రస్తుత మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి చెక్‌డ్యాం కాంట్రాక్టు వచ్చినప్పుడు బీఆర్ఎస్ పార్టీలోనే ఉన్నారని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. సమావేశంలో సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, అర్బన్ బ్యాంక్ చైర్మన్ కర్ర రాజశేఖర్, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, హుజురాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఒడితెల ప్రణవ్ బాబు, ఏఎంసీ చైర్మన్ ప్రకాశ్‌రావు, మాజీ జెడ్‌పీటీసీ సారయ్యగౌడ్, గర్రెపల్లి సత్యనారాయణ, జాని, కాశెట్టి శ్రీనివాస్, ఆకుల నర్సయ్య తదితరులున్నారు.

చింతకుంటలో ఎస్‌జీఎఫ్ సాఫ్ట్‌బాల్ పోటీలు



మాట్లాడుతున్న ప్రధానోపాధ్యాయులు టి శోభారాణి

భగత్‌నగర్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలం చింతకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ అండర్-17 సాఫ్ట్ బాల్‌పోటీలను ప్రధానోపాధ్యాయులు శోభారాణి ప్రారంభించారు. ఉమ్మడి జిల్లా నుంచి 300 మంది బాలబాలికలు పోటీలకు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య కార్యదర్శి బి.వేణుగోపాల్‌రావు, సీహెచ్ సంపత్‌రావు, అంతటి శంకరయ్య, అడెపు శ్రీనివాస్, కొమురోజు కృష్ణ, ఫిజికల్ డైరెక్టర్ అంతడుపుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు భూషణరావుపేట విద్యార్థిని

కథలాపూర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రి భువనగిరి జిల్లా పతంగి పాఠశాలలో జరిగిన రాష్ట్రస్థాయి 69వ ఎస్‌జీఎఫ్ క్రీడల్లో మండలంలోని భూషణరావుపేట ఉన్నత పాఠశాల విద్యార్థిని జాతీయస్థాయి శ్రీవర్షిణి ఎంపికైనట్టు ప్రధానోపాధ్యాయుడు నల్ల రాజయ్య తెలిపారు. అండర్ 19 విభాగంలో వచ్చే నెల 20న ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్యలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటుందన్నారు. ఎంపికైన శ్రీవర్షిణిని ఉపాధ్యాయులు, పీఈటీ వాసం నవీన్‌కుమార్ అభినందించారు.

రాష్ట్రస్థాయి కుంగ్‌ఫూ పోటీలు



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న కృష్ణ

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రస్థాయి కుంగ్‌ఫూ, కరాటే పోటీల బ్రోచర్‌ను బుధవారం జిల్లా కేంద్రంలోని వాగ్దేవి డిగ్రీ, పీజీ కళాశాల చైర్మన్ గోవిందవరం కృష్ణ ఆవిష్కరించారు. డిసెంబరు 7న వేములవాడలోని మహాలింగేశ్వర గార్డెన్‌లో పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. పోటీల నిర్వాహకులు నేరెళ్ల శ్రీధర్‌గౌడ్, రాష్ట్ర కుంగ్‌ఫూ యూనిటీ ఆఫ్ తెలంగాణ బాధ్యుడు అలగందుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను టెట్ నుంచి మినహాయించాలి

- తపస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వొడ్నాల రాజశేఖర్



నియామక పత్రాలను అందిస్తున్న రాజశేఖర్

సిరిసిల్ల టౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయులను టెట్ అర్హత పరీక్ష నుంచి ప్రభుత్వం మినహాయించాలని తపస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వొడ్నాల రాజశేఖర్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో తపస్ జిల్లా సమావేశం జరిగింది. తపస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజశేఖర్ ఎన్నికల అధికారిగా వ్యవహరించి జిల్లాలోని 13 మండలాల అధ్యక్ష, కార్యదర్శుల పదవులకు ఎన్నికలను నిర్వహించగా సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం నూతన అధ్యక్ష, కార్యదర్శులకు నియామక పత్రాలను అందజేసి వారితో ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2010 ఆగస్టు 23 కంటే ముందు నియామకమైన ఉపాధ్యాయులకు టెట్ అర్హత పరీక్ష నుంచి మినహాయించాలని అన్నారు. ఆదే విధంగా సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని, 51 శాతం ఫిట్మెంట్‌తో పీఆర్సీని ప్రకటించాలని అన్నారు. కార్యక్రమంలో తపస్ జిల్లా అధ్యక్షుడు గసికంటి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి లెంకల జయకృష్ణారెడ్డి, జోనాల్ ఇన్‌చార్జిలు గడ్డం మైపాల్‌రెడ్డి, కమ్మరికుంటు సుధాకర్ పాల్గొన్నారు.

బీసీలను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం



సమావేశంలో మాట్లాడుతున్న బీసీ సంఘ నాయకులు

గణేశ్‌నగర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్‌ను తీవ్రంగా ఖండిస్తున్నామని, 42 శాతం రిజర్వేషన్ హామీపై కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలను మోసం చేసిందని తెలంగాణ బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పెంట అజయ్ అన్నారు. బుధవారం ఉమ్మడి జిల్లా స్థాయి కార్యకర్తలతో నగరంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో స్పష్టంగా హామీ ఇచ్చిన 42బీసీ రిజర్వేషన్లు అమలు చేయకుండా ఎన్నికలకు వెళ్లడం రేవంత్ రెడ్డి ప్రభుత్వం బీసీలపై చూపుతున్న నిర్లక్ష్యమన్నారు. బీసీలను ఓటు బ్యాంక్‌గా చేసుకొని ఎన్నికల సమయంలో 42 రిజర్వేషన్ ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ పార్టీ, అధికారంలోకి రాగానే విస్మరించిందన్నారు.

జాతీయ రహదారి పనులపై పెద్దపాపయ్యపల్లిలో ఆందోళన

హుజూరాబాద్‌రూరల్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దపాపయ్యపల్లి మీదుగా వెళ్తున్న జాతీయ రహదారి పనుల వద్ద బుధవారం గ్రామస్థులు ఆందోళనకు దిగారు. ఆందోళన విషయం తెలుసుకున్న సీఐ కరుణాకర్ ఘటన స్థలానికి చేరుకున్నారు. గ్రామంలో ప్రధాన రహదారి పక్కన సర్వీసు రోడ్డు లేకపోవడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, దీనికి తోడు కాలువల్లో మురుగు నీరు నిలిచి అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై సీఐ రోడ్డు కంపెనీ ప్రతినిధులతో మాట్లాడారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా వెటనే చర్యలు తీసుకోవాలని కోరారు. రోడ్డు పనులకు ఆటంకం కలిగించవద్దని గ్రామస్థులను కోరారు.

పాఠశాలల ఆకస్మిక తనిఖీ



విద్యార్థులతో మాట్లడుతున్న ఎస్‌సిఆర్‌టి పరిశీలకురాలు చందన

తంగళ్లపల్లి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలంలోని నేరెళ్ల, బద్దనపల్లి, తంగళ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను ఎస్‌సిఆర్‌టి రాష్ట్ర పరిశీలకురాలు చందన బుధవకారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ లర్నింగ్ నడుస్తున్న బద్దనపల్లి ప్రాథమిక పాఠశాలతో పాటు తంగళ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. తరగతి గదులను పరిశీలించి, టీచింగ్ డైరీస్, బేస్ లైన్ మీట్ లైన్ ఎగ్జామ్స్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. నేరెళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉదయం ప్రార్థన సమయానికి హజరై ఉపాధ్యాయుల హజరు తదితరు అంశాలను పరిశీలించారు.

జీవితంపై విరక్తితో యువకుడి ఆత్మహత్య



రామ్‌కిరణ్ (ఫైల్)

కాజీపేట, నవంబరు 26 (ఆంధ్ర జ్యోతి): జీవితంపై విరక్తితో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన కాజీపేటలో జరిగింది. కాజీపేట ఇన్‌స్పెక్టర్ తెలిపిన వివరాల ప్రకారం... కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం లింగాపూర్ గ్రామానికి చెందిన గుర్రం శ్రీనివాస్‌కు కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు గుర్రం రామ్‌కిరణ్(24) కాజీపేట రైల్వేస్టేషన్‌లో అప్రెంటీస్ చేస్తూ స్థానికబాపూజీనగర్‌లో స్నేహితులతో కలిసి అద్దెకు ఉంటున్నాడు. కాగా, కొంతకాలంగా రామ్‌కిరణ్ మానసికంగా ఒత్తిడికి లోనవుతున్నాడు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి భోజనం చేసి నిద్రపోయాడు. ఉదయం చూసే సరికి రూంలో ఉరి వేసుకొని మృతి చెంది ఉన్నాడు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

సర్పంచ్‌గా పోటీ చేయాలంటే..

● మీకు తెలుసా

చందుర్తి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): సర్పంచ్‌గా పోటీ చేయాలనుకునే వారు నిబంధనలు పాటించాల్సి ఉంటుంది.

- ఎన్నికల్లో నామినేషన్ వేసే వ్యక్తులు 21 సంవత్సరాల వయస్సు నిండి ఉండాలి. అభ్యర్థి ప్రతిపాదకుడు సంతకం చేసిన నామినేషన్ ఉదయం 10.30 నుంచి 5 గంటల లోపు సమర్పించాలి.
- ప్రతిపాదకుడు కచ్చితంగా సంబంధిత వార్డు ఓటర్ లిస్టులో నమోదై ఉండాలి. అభ్యర్థి ప్రతిపాదకుడు ఇంటి టాక్స్ కట్టి గ్రామ పంచాయతీ నుంచి నో డ్యూ సర్టిఫికెట్ తీసుకోవాలి.
- డిపాజిట్ రుసుము సర్పంచ్ రూ. 2,000, వార్డు అభ్యర్థికి 500. ఎస్సీ, ఎస్టీ, బీసీలు కుల ధ్రువీకరణ ఇవ్వాలి. లేదంటే నామినేషన్ ఫారంలోని పార్ట్-111లో డిప్యూటీ తహసీల్దార్‌తో సంతకం చేయించాలి.
- రిజర్వుడు కేటగిరీ అభ్యర్థుల డిపాజిట్ రుసుము సర్పంచి అభ్యర్థికి రూ. 1000, వార్డు అభ్యర్థికి 250 ఇద్దరు సాక్షుల స్వీయ ధ్రువీకరణ ఇవ్వాలి.
- రిటర్నింగ్ అధికారి సమక్షంలో ఎన్నికల ఖర్చు ఖాతా నిర్వహిస్తానని చెప్పే డిక్లరేషన్‌పై సంతకం చేసి ఇవ్వాలి. అభ్యర్థి తన గుర్తింపు కార్డు కోసం ఫోటోను సమర్పించాలి.
- స్క్రూటినీ రోజున నిర్ణీత సమయానికి రిటర్నింగ్ ఆఫీసర్ ఎదురుగా హాజరు కావాలని ఎన్నికల అసిస్టెంట్ డిస్ట్రిక్ట్ ఎలక్షన్ అథారిటీ రాధ పేర్కొన్నారు.

మత్స్యకారుల కుటుంబాలకు రూ. 20 లక్షలు చెల్లించాలి



సమావేశంలో మాట్లాడుతున్న పిట్టల రవీందర్

సుభాష్‌నగర్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): కేరళ రాష్ట్రంలో అమలు చేస్తున్న విధంగా ప్రమాదవశాత్తు మరణించిన మత్స్యకారుల కుటుంబాలకు రూ. 20 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని తెలంగాణ మత్స్యకారుల సహకార సమాఖ్య మాజీ చైర్మెన్ పిట్టల రవీందర్ అన్నారు. బుధవారం నగరంలోని రెవెన్యూ గార్డెన్‌లో తెలంగాణ రాష్ట్ర మత్స్యకారులు, మత్స్యకార్మికుల 4వ రాష్ట్ర సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోవిడ్ తరువాత దేశవ్యాప్తంగా ఉన్న 4 కోట్ల మత్స్యకారులను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం రూ. 20వేల కోట్లతో ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకాన్ని ప్రారంభించిదని తెలిపారు. ముఖ్యంగా మత్స్యకారుల ఆదాయం రెట్టింపు కోసం ఈ పథకం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారని అన్నారు. అయితే రాష్ట్రంలో సంప్రదాయ మత్స్యకారుల సగటు వార్షికాదాయం రూ. 50వేలు మాత్రమేనని, అంటే నెలకు కేవలం రూ. 4వేలు మాత్రమేనని తెలిపారు. నెలకు 4వేల రూపాయల ఆదాయంతో కుటుంబాన్ని ఎలా పోషిస్తారని ప్రశ్నించారు. అయితే 20వేల కోట్లు ఖర్చు చేశామని చెబుతున్న ప్రభుత్వం అవి ఎవరికి ఇచ్చారో చెప్పాలన్నారు. సమగ్ర కుటుంబ సర్వే ప్రకారం మత్స్యకారుల సగటు ఆదాయం రూ. 8వేలని ప్రభుత్వం చెబుతుందని, ఇది ఎక్కడుందని ప్రశ్నించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఉపాధిహామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు అందించే మొత్తంతో కూడా సరితూగదన్నారు. మత్స్యకారులు చేపట వేటకు వెళ్ళి ప్రమావశాత్తు చనిపోతే రూ.4 లక్షలు ఇస్తామని కేంద్రం ప్రకటిస్తే, అంతకంటే ఒక లక్ష మొత్తం 5 లక్షలు ఇస్తామని నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించారని తెలిపారు. అయితే 2018 నుంచి 2023 వరకు 584 మంది మత్స్యకారులు చేపలవేటకు వెళ్లి మరణించారని, వారికి ఇంతవరకు ఒక్కపైసా కూడా ప్రభుత్వ పరంగా అందలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి చనిపోయిన మత్స్యకారుల కుటుంబాలకు అందచేయాని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రిజర్వాయర్లల్లో ఫ్లోటింగ్ సోలార్ ఏర్పాటును ప్రభుత్వం విరమించుకోవాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి, జిల్లా అధ్యక్షుడు పిట్టల వెంకటేష్, ప్రధానకార్యదర్శి గణేశ్, గుడికందుల సత్యం, వర్ణ వెంకటరెడ్డి, గీట్ల ముకుందరెడ్డి, పప్పు సదానందం, రమేశ్,యు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కళ్లకు గంతలతో బీసీ యువజన సంఘం నిరసన

గణేశ్‌నగర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): బీసీ యువజన సంఘం ఆధ్వర్యంలో బుధవారం తెలంగాణ చౌక్‌లో కళ్లకు గంతలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేసుపెద్ది శ్రీధర్ రాజు మాట్లాడతూ కామారెడ్డి డిక్లరేషన్‌లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని కాంగ్రెస్ ప్రకటించిందని, కేంద్రంపై ఒత్తిడి తీసుకొచ్చి బీసీ బిల్లును రాజ్యాంగ సవరణ ద్వారా 9వ షెడ్యూల్‌లో చేర్చి చట్టబద్ధత కల్పించే విషయంలో పూర్తిగా విఫలమైందని అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాన్ని నిలబెట్టుకోలేదన్నారు. బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షులు నర్సింగోజు శ్రీనివాస్, జిల్లా కన్వీనర్ రవీంద్రచారి, ఉమా మహేశ్వర్, నరాల శ్రీకాంత్ ఉన్నారు.

పల్లెపోరుకు వేళాయె...

(5వ పేజీ తరువాయి)

136జనరల్ కాగా, ఎస్టీలు 29, ఎస్సీలు 47, బీసీలు 57, జనరల్ 105 కేటాయించారు.

తొలి విడతలో 114282 మంది ఓటర్లు

జిల్లాలో 260 గ్రామపంచాయతీలో 3లక్షల 53వేల 351మంది ఓటర్లున్నారు. వీరిలో పురుషులు 1701772మంది, మహిళలు 182559 మంది ఉన్నారు. మొదటి విడతలో 114282 మంది ఓటర్లు ఉండగా పురుషులు 55052 మంది,మహిళలు 59230 మంది ఉన్నారు.

ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు...

బోయినపల్లి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) కరీంనగర్ డీసీసీ అధ్యక్షుడిగా నియామకమైన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మాజీ డీసీఎంస్ చైర్మన్ ముదుగంటి సురేందర్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు ఏనుగుల కనకయ్య, మండల అధ్యక్షులు వన్నెల రమణారెడ్డి, మాజీ ఎంపీటీసి లక్ష్మీరాజం ఉన్నారు.

గెలుపే లక్ష్యంగా పని చేయాలి

- వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): వేములవాడ నియోజకవర్గ పరిధిలోని అన్ని గ్రా మాల్లో నిలబడే కాంగ్రెస్ అభ్యర్థి విజయమే లక్ష్యం గా కార్యకర్తలు కలిసికట్టుగా పని చేయాలని శాస నసభ్యుడు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సూచించా రు. పట్టణంలోని మల్లారం రోడ్డులో గల ఫంక్షన్ హాల్‌లో బుధవారం నియోజకవర్గ స్థాయి కాంగ్రెస్ నాయకుల సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో అభ్యర్థుల ఎంపిక సెలెక్ట్ అండ్ ఎలెక్ట్ పద్ధతిలో ఉంటుం దని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి ఓట్లు అడగాలన్నారు. రాష్ట్ర వ్యాప్తం గా కాంగ్రెస్ పార్టీకి మంచి వాతావరణం నెలకొందని, దాన్ని ఓటు రూపంలో మార్చేందుకు గ్రామీణస్థాయిలో కార్యకర్తలు కృషి చేయాలన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్ని కల్లో కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టడంతో కాంగ్రెస్‌కు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్ మార్కెట్ కమిటీ చైర్మన్‌లు, మండలాల కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పాల్గొన్నారు.

వైభవంగా సుబ్రహ్మణ్యస్వామి షష్ఠి పూజలు

ఎల్లారెడ్డిపేట, నవంబరు26(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంతో పాటు అల్మాస్‌పూర్ గ్రామంలోని శ్రీ హరిహరపుత్ర అయ్యప్పస్వామి ఆలయాల్లో సుబ్రహ్మణ్యస్వామి షష్ఠి పూజలను బుధవారం వైభవంగా నిర్వహించారు. గురుస్వామి శ్రీను ఆధ్వర్యంలో అర్చకులు పురుషోత్తమచార్యులు గౌతమ్‌చార్యులు స్వామివారికి అభిషేకం, కాల సర్పదోషం, కుజదోషం నివారణ పూజలను జరిపించారు. మహిళలు మంగళహారతులు సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, అయ్యప్ప దీక్ష పరులు, భక్తులు పాల్గొన్నారు.

● వేములవాడ : వేములవాడ పట్టణంలోని సుబ్రహ్మణ్య స్వామి షష్టిపూజను అర్చకులు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని తిప్పాపూర్ అయ్యప్ప స్వామి ఆలయంలోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వరుడికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పూజ కార్యక్రమానికి హాజరైనట్లు అర్చకులు తెలిపారు.

గీత జ్ఞాన యజ్ఞం ప్రారంభం

సిరిసిల్ల టౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని సద్గురు మలయాళ గీత ఆశ్రమంలో మంగళవారంరాత్రి గీత జ్ఞాన యజ్ఞంను ప్రారంభించారు. యజ్ఞం బ్రహ్మచారి అక్షయ చైతన్య స్వామీజీ ముందుగా ధ్వజారోహణం చేసి దీపారాధన ప్రవచనాలను ప్రారంభించారు. సిరిసిల్ల గీత ప్రచార సేవా సమితి అధ్యక్షుడు కోడం నారాయణ, ప్రధాన కార్యదర్శి జనపాల శంకరయ్య, సభ్యులు గజ్జెల్లి రామచంద్రం, ఏనుగుల ఎల్లయ్య, చిన్మయ మిషన్ ప్రధాన కార్యదర్శి నల్ల శ్రీనివాస్, ప్రచార కార్యదర్శి మెరుగు మల్లేశం, గోషికొండ దామోదరం పంతులు, దాసరి రాజేష్, జయమ్మ, గడ్డం కౌసల్య పాల్గొన్నారు.

ఘనంగా వెజిటబుల్స్ అండ్ ఫ్రూట్స్ ఫెస్టివల్



ఫ్రూట్స్, వెజిటబుల్స్ వేషధారణలో విద్యార్థులు

సిరిసిల్ల టౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని వివేకానంద విద్యానికేతన్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో బుధవారం ఘనంగా వెజిటబుల్స్ అండ్ ఫ్రూట్స్ ఫెస్టివల్‌ను నిర్వహించారు. పాఠశాల విద్యార్థులు వివిధ ఆకృతుల్లో పండ్లు, కూరగాయలను తయారుచేశారు. ఫ్రూట్స్, వెజిటబుల్స్ ప్రాముఖ్యతను తెలుపుతూ తయారుచేసిన చార్ట్ల ద్వారా విద్యార్థులు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ దిడ్డి శ్రీనివాస్, ప్రిన్సిపాల్ బుచ్చరావు, ఇన్‌చార్జిప్రిన్సిపాల్ మహేందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కార్యవర్గం ఎన్నిక

గంభీరావుపేట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : టీయూడబ్ల్యూజే ఐజేయూ మండల నూతన కార్యవర్గం బుధవారం ఎన్నికైంది. అధ్యక్షుడి అబ్దుల్ రహీం, ఉపాధ్యక్షుడిగా లింగారెడ్డిగారి అర్జున్‌రెడ్డి, ప్రధానకార్యదర్శిగా అరిగె రమేష్, సహాయకార్యదర్శిగా పల్లె శ్రీనివాస్, కోశాధికారిగా సిరిపురం అంజయ్య, కార్యవర్గ సభ్యులుగా సాదత్, షబ్బీర్, చేపూరి సంతోష్ చారీలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా అధ్యక్షుడు దండి సంతోష్‌కుమార్ సమక్షంలో ఎన్నిక జరగగా, లీగల్‌సెల్ అడ్వైజర్ కమిటీ సభ్యుడు రేగుల దేవేందర్ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు.

గుండెపోటుతో ఒకరి మృతి

తంగళ్లపల్లి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : తంగళ్లపల్లి మండలం ఒబులాపూర్ గ్రామానికి చెందిన పడిగెల లింగయ్య(40) గుండెపోటుతో మంగళవారం రాత్రి మృతిచెందాడు. పోలీసులు, బంధువులు తెలిపిన వివరాలు.. లింగయ్య మూడేళ్లుగా శ్వాస, కిడ్నీ, లివర్ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నాడు. మంగళవారం రాత్రి వ్యాధులకు సంబంధించి మాత్రలు వేసుకున్నాక గుండెలో నొప్పి వస్తోందని కుటుంబ సభ్యులకు తెలుపడంతో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందాడని వైద్యులు పేర్కొన్నట్లు మృతుడి భార్య రేఖ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కాగా లింగయ్య మృతిపై అనుమానాలు వ్యక్తం కావడంతో పోస్టుమార్టం నిర్వహించినట్లు తెలిసింది.

సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలి

తంగళ్లపల్లి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ ప్రచారం చేపట్టాలని, కార్యకర్తలకు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జల్గం ప్రవీణ్ పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలో మార్కండేయ ఫంక్షన్ హాల్‌లో కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ప్రవీణ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పలు సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ ప్రచారం నిర్వహించాలన్నారు. గత ప్రభుత్వ దోపిడీని ఎండగట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు లింగాల భూపతి, నేరెళ్ల నర్సింగం, మచ్చ శ్రీనివాస్, సత్తు శ్రీనివాస్‌రెడ్డి, భైరినేని రాము, పొన్నాల పర్శరాములు, తిరుపతిరెడ్డి, శ్రీని వాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజల్లో రాజకీయ చైతన్యం పెంచడానికి కృషి

సిరిసిల్ల రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాలు ప్రజలు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేస్తున్నాయంటూ కేంద్రహోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ ముద్రించిన కరపత్రాలను బీజేపీ పట్టణ అధ్యక్షుడు దుమాల శ్రీకాంత్ ఆధ్వర్యంలో నాయకులు బుధవారం ఇంటింటికి వెళ్లి ప్రజలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మహిళా మోర్చా పట్టణ అధ్యక్షురాలు వేముల వైశాలి సురేష్ , బీజేపీ నాయకులు కోడం రవి, శేఖర్, అభి, రామారావు,విజయ్, ప్రవీణ్, కౌసల్య, లత,రేఖా పద్మ తదితరులు పాల్గొన్నారు.

● ముస్తాబాద్ : మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు సొల్ల క్రాంతికుమార్ ఆధ్వర్యంలో కరపత్రాలను పంపిణీ చేశారు. వర్తక, వ్యాపారులు, ప్రజల వద్ద సంతకాలు సేకరించారు. జిల్లా కార్యదర్శి మీస సంజీవ్, జిల్లా కౌన్సిల్ మెంబర్ మెర్గు అంజాగౌడ్, మండల పదాధికారి మీస స్వామి, మెంగని మహేందర్, మీస శంకర్, వరి వెంకటేశ్, దీటి సత్తయ్య, మీస శ్రీనివాస్, బుర్ర శ్రీనివాస్, శివకుమార్ పాల్గొన్నారు.

● గంభీరావుపేట : మండల కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో కరపత్రాలను ప్రజలకు అందజేసి సంతకాలను సేకరించారు. కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షుడు కోడె రమేష్, ఓబీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి కొక్కు దేవేందర్, మండల మాజీ అధ్యక్షుడు గంట అశోక్, ప్రధాన కార్యదర్శి మల్లేశ్‌యాదవ్, ఉపాధ్యక్షులు నర్సింలు, నాయకులు నాగరాజు, సత్యనారాయణ, రమేష్, శ్రీనివాస్, భాస్కర్, రాజు, రవీందర్, చారీ, స్వామి, అంజనేయులు తదితరులు ఉన్నారు.

● రుద్రంగి : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలం అయిందని బీజేపీ మండల అధ్యక్షుడు కర్నవత్తుల వేణు అన్నారు. మండల కేంద్రంలో బీజేపీ కరపత్రాలను, సంతకాల సరేకణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బాలకిషన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు పరీక్షలంటే భయాన్ని వీడాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సైకాలజిస్ట్ పున్నం చందర్

తంగళ్లపల్లి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పరీక్షలంటే భయాన్ని వీడాలని సైకాలజిస్ట్ పున్నం చందర్ అన్నారు. బుధవారం మండేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెల్పింగ్ హార్ట్స్ వెల్ఫేర్ సొసైటీ, తెలంగాణ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు పరీక్షలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లడుతూ వత్తిడితో కూడిన విద్య విద్యార్థుల్లో జ్ఞాపకశక్తి లోపాలకు కారణమవుతుందన్నారు. క్రమశిక్షణతో కూడిన విద్య విద్యార్థిని ఉన్నతస్థానంలో నిలుపుతుందని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో హెల్పింగ్ హార్ట్స్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు అలువాల ఈశ్వర్, న్యాయవాది దాసరి తిరుమల, హెచ్‌ఎం అనురాధ, సజ్జనం శ్రీనివాస్, అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

● సిరిసిల్ల రూరల్ : మరమగ్గాల కార్మికులు తమ ఆరోగ్యాల పట్ల సంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని సైకాలజిస్ట్ పున్నంచందర్ కోరారు. సిరిసిల్ల పట్టణంలోని గణేష్‌నగర్‌లో బుధవారం మైండ్ కేర్ అండ్ కౌన్సెలింగ్ సెంటర్ ప్రభుత్వ వైద్యశాల ఆధ్వర్యంలో మరమగ్గాల కార్మికులకు మనో వికాస సదస్సును సైకాలజిస్ట్ కె. పున్నంచందర్ నిర్వహించారు. కార్మికులు మానసిక ఆరోగ్య సంరక్షణకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. కార్యక్రమంలో అసాములు, కార్మికులు పాల్గొన్నారు.

రాజ్యాంగ స్ఫూర్తితో సేవలందించాలి : ఎస్పీ



జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రతిజ్ఞ చేస్తున్న ఎస్పీ, అధికారులు

సిరిసిల్ల రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : భారత రాజ్యాంగ స్ఫూర్తితో ప్రజలకు సమర్థవంతంగా సేవలను అందిస్తూ దేశాభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని ఎస్పీ మహేష్ బీ గీతే అన్నారు. సిరిసిల్ల జిల్లా పోలీస్ కార్యాలయంలో బుధవారం భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి ఎస్పీ మహేష్ బీ గీతే పూలమాలలు వేసి స్మరించుకున్నారు. అనంతరం పోలీసు అధికారులు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సీఐలు రవి, మధుకర్, ఆర్ఐ యాదగిరి అడ్మినిస్ట్రేషన్ అధికారి పద్మ, ఎస్ఐలు కిరణ్, జ్యోతి, సాయి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

17వ పోలీస్ బెటాలియన్‌లో...

సిరిసిల్ల అర్బన్ పరిధిలోని సర్ధాపూర్ 17వ పోలీస్ బెటాలియన్‌లో బుధవారం జాతీయ రాజ్యాంగ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. బెటాలియన్‌లో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి అసిస్టెంట్ కమాండెంట్ జె. రాందాస్ పూలమాలలు వేశారు. అనంతరం పోలీస్‌లతోప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ సురేష్, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అస్తవ్యస్తంగా రోడ్డు.. తప్పని ఇబ్బందులు



మర్రిపల్లి ప్రధాన రహదారిపై ఏర్పడిన భారీ గుంతలు

వేములవాడ రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధి మర్రిపల్లి గ్రామంలోని కోరుట్ల-వేములవాడ ప్రధాన రహదారి అస్తవ్యస్తంగా మారడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మర్రిపల్లి నుంచి వేములవాడ వరకు గతంలో లక్షల రూపాయలు పెట్టి నిర్మించిన బీటీ రోడ్డు అధ్వానంగా మారింది. రోడ్డుపై వేసిన తారు కొట్టుకుపోవడంతో రోడ్లపై గుంతలు ఏర్పడి వాహనాలకు ఇబ్బందవుతుందని ప్రజలు పేర్కొంటున్నారు. రోడ్డుపై కంకర లేచి ప్రధాన రహదారి మధ్యలో పెద్ద గుంతలు ఏర్పడడంతో ఇబ్బందికరంగా మారిందని, అధికారులు రోడ్డుకు మరమ్మతులు చేయించాలని వాహనదారులు కోరుతున్నారు.

ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

వేములవాడ రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తే కఠిన చర్యలుంటాయని ఎంపీడీవో శ్రీనివాస్ అన్నారు. ఆయన మాట్లాడుతూ సర్పంచ్ ఎన్నికల నేపథ్యంలో గురువారం నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. ఇందుకోసం మండలంలో 17 గ్రామాలకు సంబంధించి 5 నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను ఏర్పాటు చేసామన్నారు. నామినేషన్ల స్వీకరణ కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లను పూర్తిచేశామని, సిబ్బందికి అవసరమైన సామగ్రిని అందించామన్నారు.

కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడికి ఘన సన్మానం

సిరిసిల్ల టౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎంపికైన సంగీతం శ్రీనివాస్‌ను బుధవారం సిరిసిల్లలోని ఆయన గృహంలో జిల్లా పద్మశాలి సంఘం నాయకులు శాలువ, పుష్పగుచ్ఛాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు బాలయ్య, ప్రధాన కార్యదర్శి రాజు, ఉపాధ్యక్షులు కొండ ప్రతాప్, పోతు అంజనేయులు, కార్యదర్శి నాగుల విష్ణుప్రసాద్, సభ్యులు పాల్గొన్నారు.

కాల్వ పూడికతీత పనులు చేపట్టాలి

ఎల్లారెడ్డిపేట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండలం సముద్రలింగాపూర్ శివారులోని సింగసముద్రం చెరువు నుంచి ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని గిద్దె చెరువు వరకు సాగునీటి కాల్వ పూడికతీత పనులను చేపట్టాలని ఆయకట్టు రైతులు బుధవారం కోరారు. సాగు నీటి కాల్వ పిచ్చి మొక్కలు, చెత్తాచెదారంతో నిండిపోయిందని పేర్కొన్నారు. సాగునీరు పంట పొలాలకు చేరకుండాపోతున్నాయని అన్నారు. సంబంధిత శాఖ అధికారులు స్పందించి పూడిక తీత పనులను చేయించాలని ఆయకట్టు రైతులు కోరారు.

బాధిత కుటుంబాలను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే

ఇల్లంతకుంట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సిరికొండ, అనంతగిరి గ్రామాలలో వివిధ కారణాలతో మృతిచెందిన వారి కుటుంబాలను మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ పరామర్శించారు. జడ్పీ మాజీ వైస్‌చైర్మన్ సిద్ధం వేణు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పల్లె నర్సింహ్మారెడ్డి, నాయకులు మీసరగండ్ల అనీల్‌కుమార్, సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్‌తో ఫ్లెక్సీల తొలగింపు

ఇల్లంతకుంట, నవంబరు 26(ఆంధ్రజ్యోతి) : గ్రామపంచాయితీ ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో గ్రామాలలోని ఫ్లెక్సీలను పంచాయతీ కార్యదర్శులు తొలగించారు. మండలంలో రెండవ విడత ఎన్నికలు జరుగనున్నాయి. ఇల్లంతకుంటలో అభివృద్ధి కార్యక్రమాల శిలాఫలకాలపై పేర్లు కనిపించకుండా కాగితాలను అతికించారు. ఎన్నికలు ముగిసేంత వరకు గ్రామాల్లో అనుమతులు లేకుండా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయవద్దని సూచించారు.

అభ్యర్థులను గెలిపించాలి

వేములవాడ టౌన్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించుకోవాలని బీజేపీ నాయకులు కుమ్మరి శంకర్ అన్నారు. బుధవారం వేములవాడ అర్బన్ మండలం బీజేపీ మండల కార్యకర్తల సమావేశం అధ్యక్షుడు బుర్ర శేఖర్‌గౌడ్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో అర్బన్ మండలంలోని పలు గ్రామ శాఖ అధ్యక్షులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల ప్రజలకు సమాన అవకాశాలు

- గ్రంథాలయ సంస్థ జిల్లా అధ్యక్షుడు నాగుల సత్యనారాయణ



కార్యక్రమంలో మాట్లాడుతున్న గ్రంథాలయ చైర్మన్ సత్యనారాయణ



బీజేపీ కార్యాలయంలో వేడుకలు..

సిరిసిల్ల టౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : భారత రాజ్యాంగంతో దేశంలోని అన్ని వర్గాల ప్రజలకు సమాన అవకాశాలు దక్కాయని గ్రంథాలయం సంస్థ జిల్లా అధ్యక్షుడు నాగుల సత్యనారాయణ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని గ్రంథాలయం ఆవరణలో భారత రాజ్యాంగ దినోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా భారత రాజ్యాంగ చిత్రపటానికి, డాక్టర్ బీఆర్ఎస్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడారు. తెలంగాణ రచయితల సంఘం అధ్యక్షుడు జూకంటి జగన్నాథం, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు గుడ్ల రవి, మాజీ కౌన్సిలర్లు ఆడెపు ప్రభాకర్, చంద్రకళ, సిరిసిల్ల సాహితీ సమితి జిల్లా అధ్యక్షుడు జనపాల శంకరయ్య, గ్రంథాలయం సంస్థ ఇంచార్జి కార్యదర్శి బి శంకరయ్య, గ్రంథాలయం పాలకుడు కమటం మల్లయ్య, సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.

సమరసత వేదిక, అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో

సామాజిక సమరసత వేదిక, జిల్లా అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో వేరువేరుగా భారత రాజ్యాంగ దినోత్సవం వేడుకలు జరగాయి. వేదిక జిల్లా కన్వీనర్ మోర శ్రీనివాస్, జిల్లా అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు కత్తెర దేవదాస్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

● సిరిసిల్ల రూరల్ : దేశ అభ్యున్నతికి కట్టుబడి ఉంటూ ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి కోరారు. జిల్లాకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలు వేశారు. ఈసందర్భంగా గోపి మాట్లాడారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు దుమాల శ్రీకాంత్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మ్యానరాంప్రసాద్, భాగయ్య, మోరశ్రీహరి, సూరం వినయ్, ఊరగొండ రాజు, శేఖర్, చొక్కి శ్రీనివాస్, జిందం సంతోష్, మల్లికార్జున్, జగదీష్ పాల్గొన్నారు.

● కోనరావుపేట : మండల కేంద్రంలో భారత రాజ్యాంగ దినోత్సవాన్ని సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ సింగం ప్రసాద్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టూ కే రన్ నిర్వహించి డాక్టర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. మాల మహానాడు నాయకులు తుంగ శివరాజు, మాందాల శ్రీనివాస్, యాస శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

● ఎల్లారెడ్డిపేట/వీర్నపల్లి : ఎల్లారెడ్డిపేట,వీర్నపల్లి మండల కేంద్రాలతో పాటు పలు గ్రామాల్లో రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. స్థానిక అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. గ్రామ పంచాయతీ కార్యాలయాలు, విద్యాసంస్థల్లో తాజా, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు ప్రతిజ్ఞ చేశారు.

● ఇల్లంతకుంట : మండలంలో వేడుకలు ఘనంగా జరిగాయి. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో విద్యార్థులకు రాజ్యాంగపై అవగాహన కల్పించారు. ప్రపంచదేశాలలో భారత రాజ్యాంగం ఉన్నతమైనదన్నారు. రాజ్యాంగానికి అనుగుణంగానే ప్రభుత్వాలు కొనసాగుతున్నాయని ఉపాధ్యాయులు పేర్కొన్నారు.

● గంభీరావుపేట : మండల కేంద్రంలో వేడుకలు నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలతో పాటు పలు పాఠశాలల్లో దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, జాతీయ మాలల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు దోసల చంద్రం, అధ్యాపకులు, నాయకులు పాల్గొన్నారు.

● చందుర్తి : చందుర్తి మండలం నర్సింగాపూర్, సనుగుల గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస పోటీలు, క్విజ్‌కాంపిటీషన్స్, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు జితేందర్, ముఖేష్ జలందర్, ఉపాధ్యాయులు బాల్‌రెడ్డి, శ్రీనివాస్, లక్ష్మణ్, పావని, మహేష్, బనాజీ, ఈగ శ్రీనివాస్, శ్రీనివాస్, సాగర్, కార్తీక్, అశోక్ శ్రీధర్, రాజు, నాగరాణి, పద్మ, శ్రీనివాస్ అనిత పాల్గొన్నారు.

● తంగళ్లపల్లి : మండలకేంద్రంలో రాజ్యాంగ దినోత్సవాన్ని జరుపుకున్నారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జల్గం ప్రవీణ్ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



కోనరావుపేటలో 2కే రన్‌లో పాల్గొన్న యువకులు

కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్, హెల్ప్‌లైన్ సెంటర్ ఏర్పాటు



ఎన్నికల కంట్రోల్ రూంను పరిశీలిస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్

సిరిసిల్ల కలెక్టరేట్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన కంట్రోల్ రూమ్, హెల్ప్‌లైన్ సెంటర్, మీడియా సెంటర్‌ను ఇన్‌చార్జి కలెక్టర్ గరీమ అగ్రవాల్ బుధవారం ప్రారంభించారు. ఈసందర్భంగా 24 గంటలు పని చేసే కంట్రోల్‌రూమ్, మీడియా సెంటర్‌ను పరిశీలించారు. అధికారులతో మాట్లాడారు. ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభపెడుతున్నట్లు ఫిర్యాదులు వచ్చినా.. మీడియాలో ఫేక్ న్యూస్ ప్రసారమైనా, ఓటర్లు ఏదైనా సందేహాల నివృత్తికి, సమాచారం కోసం సంప్రదించిన స్పందించాలన్నారు. ఎన్నికల ఫిర్యాదుల ఉంటే ప్రజలు కంట్రోల్‌రూం నంబర్ 1800233 1495 అందుబాటులో ఫోన్ చేసి చెప్పవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, డీఆర్‌డీఓ శేషాద్రి, జడ్పీడిప్యూటీ సీఈఓ గీత, డీపీఓ షర్ఫొద్దిన్, ఏవో రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ అభివృద్ధి పనులకు కాంగ్రెస్ ప్రచారం..

వేములవాడ టౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కేసీఆర్ హయాంలో చేపట్టిన అభివృద్ధి పనులకు కాంగ్రెస్ ప్రచారం చేస్తోందని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, సెస్ మాజీ డైరెక్టర్ రామతీర్థపు రాజు అన్నారు. బుధవారం వేములవాడ పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి నివాసంలో నాయకులు నిమ్మశెట్టి విజయ్, నీలం శేఖర్, మారం కుమార్‌లతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. వేములవాడ పట్టణంలోని 6వ వార్డులో పేదల కోసం గతప్రభుత్వ హయాంలో చేపట్టిన డబుల్ బెడరూం ఇళ్ల కోసం ప్రభుత్వం సేకరించిన భూమిలో 144మందికి ఇస్తామని పునాది నుంచి స్లాబ్ వరకు ప్రణాళిక సిద్ధం చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే వాటికి ఇందిరమ్మ ఇల్లు అని పేరు పెట్టి పేదలకు ఇస్తామని కేవలం వారికి నచ్చిన వాళ్లకే 144 మంది జాబితాలో పేరు చూపెట్టి ఇళ్ల స్థలాలు లేని దాదాపు 1500 మందికి లబ్ధిదారులకు మొండి చేయి చూపించారని ఆరోపించారు. అర్హతగల నిరుపేదలకు డబుల్ బెడ్‌రూం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాలను పరిశీలించేందుకు ప్రభుత్వ విప్, జిల్లా అధికారులతో కలిసి వెళ్లగా ఫ్లోరింగ్‌పై నిలబడిన కూలిపోయిందన్నారు. బీఆర్ఎస్ పట్టణ కార్యదర్శి కందుల క్రాంతికుమార్, మాజీ కౌన్సిలర్‌లు జోగిని శంకర్, ముందకోల వెంకన్న, వాసాల శ్రీనివాస్, అంజద్‌పాషా, ఉమర్, ఎస్ఎన్‌రెడ్డి, సందీప్, భాస్కర్, రాకేష్, రఫిక్, పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ నిధులతోనే అభివృద్ధి

- బీజేపీ వేములవాడ నియోజకవర్గ ఇన్‌-చార్జి వికాస్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న వికాస్‌రావు

కోనరావుపేట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో కేంద్ర ప్రభుత్వ నిధులతోనే అభివృద్ధి జరుగుతోందని బీజేపీ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చెన్నమనేని వికాస్‌రావు అన్నారు. కోనరావుపేట మండలం నాగారం గ్రామంలో బుధవారం మీడియా సమావేశంలో మాట్లాడారు. గ్రామాల్లో సర్పంచ్ ఎన్నికల నగారా మోగిందని, దాదాపు2 సంవత్సరాలు స్థానిక సంస్థలు లేకుండా ఈ ప్రభుత్వం నడుస్తుందని, అభివృద్ధి నీరుగారిపోయిందని, గ్రామాల్లో అభివృద్ధి జరగాలి అంటూ నిధులు తీసుకొచ్చే సర్పంచ్‌ని ప్రజలు ఎన్నుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధులతోనే గ్రామాల్లో అభివృద్ధి జరుగుతుందన్నారు. గ్యాస్, రేషన్ బియ్యం, గ్రామాల్లో రోడ్లు ఇవన్నీ కేంద్ర ప్రభుత్వ నిధులతోనే అవుతున్నాయి అని తెలియజేశారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ ఎంపీ లాడ్స్ నిధుల ద్వారా కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని గ్రామాల్లో సీసీ రోడ్లు, స్ట్రీట్ లైట్స్, బోర్‌వెల్స్, విద్యా, వైద్యంపై ప్రత్యేక దృష్టి పెడుతున్నారన్నారు. అలాగే బీజేపీ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థిని ప్రజలు ఏకగ్రీవంగా గెలిపిస్తే 10 లక్షలు గ్రామ అభివృద్ధికి ఇస్తామని చెప్పారన్నారు. అలాగే ఎంపీ లాడ్స్ నిధులు, సీఎస్ఆర్ నిధుల తీసుకొస్తా అని స్పష్టం చేశారని అన్నారు. బీజేపీ బలపరిచిన అభ్యర్థిని గెలిపిస్తే వారి వెంట కేంద్ర మంత్రి బండి సంజయ్ ఉంటారు అని ప్రజలు గుర్తుపెట్టుకోవాలి అన్నారు. ప్రజలు ప్రలోభాలకు లొంగకుండా బీజేపీ పార్టీ అభ్యర్థులను గెలిపించి గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సిరికొండ శ్రీనివాస్, మండల అధ్యక్షుడు బాలాజీ, మాజీ జడ్పీటీసీ అన్నపూర్ణ, మాజీ వైస్ ఎంపీపీ రవీందర్ గౌడ్, సురేష్, బిజెపి కార్యకర్తలు పాల్గొన్నారు.